GIRDHARI, RNI Regn.No.TELTEL/2021/80612, Date of Pub - 25th of every month
Date posting - 1st of every month at BPC-IV, Patrika Channel, HYD - 01
Postal Regn.No.HQ/SD/525/2024-2026; Licensed to Post without prepayment
WPP No.PMG/TS/HQR/SC-04/WPP/2024-2026



Edited, printed, published and owned by Swami Sundara Chaitanyananda, Printed at M/s Karshak Print Solutions Pvt. Ltd., Moula Ali, Hyd - 500 040.


IF UNDELIVERED PLEASE RETURN TO :
SUNDARA CHAITANYA ASHRAM
HYDERABAD - 500 043

గిరిధారి

మే 2025

శాశ్వత చందా రూ.1200/-
10 సం॥ లకు








హైదరాబాద్ సుందర చైతన్యాశ్రమంలో జగద్గురు శ్రీ ఆదిశంకరాచార్య స్వామి
ఆలయ ఆవిష్కరణ మహోత్సవం (మే 2014)





ప్రార్థన




శ్లో॥ శ్రుతి స్మృతి పురాణానామ్
ఆలయం కరుణాలయమ్
నమామి భగవత్పాదం
శంకరం లోక శంకరమ్ ॥

శ్రుతి స్మృతి పురాణాలకు పవిత్ర నిలయమైన వాడు, కరుణా స్వరూపుడు, లోకమునకు సుఖమును ప్రసాదించు గురుదేవులు శ్రీ శంకర భగవత్పాదులకు నమస్కారము.

పండుగలు

2-5-2025
శ్రీ ఆదిశంకరాచార్య స్వామి
జయంతి



గీతాధారి

ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి : 40 సంచిక : 6

వ్యవస్థాపకులు :
శ్రీ స్వామి సుందర చైతన్యానంద

సంపాదకులు : శ్రీ స్వామి సుందర చైతన్యానంద

ఇందులో

జీవిత సభ్యత్వం - రూ. 1200 /-
(10 సంవత్సరములు)

డి.టి.పి. & కవర్ డిజైన్
సుందర చైతన్యాశ్రమం, హైదరాబాద్

ప్రింటింగు : బైండింగు
కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాద్

వివరములకు : సుందర చైతన్యాశ్రమం,
దుండిగల్ రోడ్, హైదరాబాద్ - 500 043. ఫోన్:(08418)255777, 9100908777


Visit us at : www.sundarachaitanyam.com (email : admin@sundarachaitanyam.org)

ఆప్తవాక్యం

కరమధ్యేతు గోవిందః

భగవంతుడు సర్వ మానవాళికి సమానంగా పంచిన అనుగ్రహ ప్రసాదమే మనస్సు. మనస్సు ఉండటం చేతనే సర్వజీవులలో మానవ జన్మ ఉత్కృష్టమని కీర్తించ బడింది.

న హి మానుషాత్ శ్రేష్ఠతరం హి కించిత్।



మానవ జన్మ కన్నా శ్రేష్ఠమైన జన్మ మరొకటి లేదని శాస్త్రం. ఆ శ్రేష్ఠత్వము మనస్సు వల్లనే మనిషికి ప్రాప్తించింది. భగవంతుడు ప్రసాదించిన మనస్సును రక్షించుకోవడం, తిరిగి ఆ మనస్సును భగవంతునికి సమర్పించడం మనందరి కర్తవ్యము.

మనస్సుపై ఎన్నో దెబ్బలు పడు తుంటాయి. కొన్నయితే, దుర్భరమైన సమ్మెట పోట్లులా ఉంటాయి. మనస్సుకు దెబ్బ తగిలితే నిద్ర రాదు. కాని, కాసేపు నిద్ర పోగలిగితే మనస్సు శాంతిస్తుంది. గాయపడిన మనస్సు ప్రశాంతంగా నిద్రించాలంటే, మనస్సును ఈశ్వరాధీనం చేయడం మనిషికి అలవాటు కావాలి.

పట్టణంలో గజదొంగలు సంచరిస్తున్నారని తెలిసి నపుడు, సంపద లున్నవారికి నిద్ర పట్టదు. అదే సంపదను బ్యాంకు లాకర్‌లో దాచితే, ఆ క్షణం నుండే హాయిగా నిద్ర పడుతుంది. మనస్సు విషయం కూడా అంతే.

మనస్సు ఎలా గాయ పడుతుందో, ఎందుకు గాయ పడుతుందో, గాయపరచే దెవరో - ఇవన్నీ సూక్ష్మంగా అర్థం చేసుకో వలసిన విషయాలు.

బంతి విసిరే వాడొకడు, బంతిని బ్యాట్‌తో బాదేవాడు మరొకడు, - బాటలో నడిచి పోతున్న వ్యక్తికి బంతి తగిలి బుర్ర పగిలితే, ఆ బాధ బంతిని విసిరిన వాడికీ తెలియదు. బంతిని బాదిన వాడికీ అర్థం కాదు. ఆ బాధ ఎంత దుర్భరమో తగిలిన వాడికే తెలుస్తుంది.

అదలా ఉంచండి. ఒకవేళ, గాయం కావడానికి పిచ్చోడి చేతిలోని రాయే కారణమైతే, ఆ తగిలింది పందికైనా, లేదా పరమహంసకైనా చేయగలిగిం దేముంటుంది?

ఇది పాగల్ ప్రపంచం.

అందరి చేతుల్లో రాళ్ళున్నాయి. ఎవరు ఎప్పుడు విసురుతారో అర్థం కాదు. ఆ విసిరే వ్యక్తి తల్లి కావచ్చు. తండ్రి కావచ్చు. భర్త కావచ్చు. భార్య కావచ్చు. సంతానం కావచ్చు. స్నేహితులు కావచ్చు. శత్రువులు కావచ్చు. అపరిచితులు కావచ్చు. అప్రయోజకులు కావచ్చు.

ఎవరు విసిరినా, అయ్యేవి మాత్రం గాయాలే. కలిగేవి మాత్రం బాధలే.

నీ చేతిలో కూడా రాళ్ళుండి, వాటిని పరులపై విసిరే కర్కశత్వం నీకూ ఉంటే, నీ జోలికి ఎవ్వరూ రారు. నువ్వు హాయిగా ఉండ గలవు. అభద్రత లేకుండా జీవించ గలవు. భద్రంగా ఉండ గలవు.

కాని, సాధువు మాత్రం కాలేవు. భక్తుడివి కాలేవు. భక్తుడే కాని వాడు జ్ఞాని ఎలా అవుతాడు? బ్రహ్మజ్ఞాని ఎలా అవుతాడు?

భూమి గుల్ల బారేటట్లు, గునపాలతో గ్రుచ్చి గ్రుచ్చి పెకలిస్తాము. గుండెలలో గునపాలు దిగుతూ ఉంటే భూమాతకు బాధ లేకుండా ఉంటుందా? అయినా, గ్రుచ్చిన వారికే ప్రేమతో ధాన్యాన్ని పంచుతుంది. ఫలాలను వితరణ చేస్తుంది. పరిమళ సుమాలతో దోసిళ్ళను నింపుతుంది.

అదంతా భూదేవి సహనమని కవులు కీర్తించవచ్చు. అది సహనం కాదు, సహజ స్వభావం, స్వరూప వైభవం అనే సత్యం అందరికీ అర్థం కావాలని భావించడం ఎంత అసహజమో విజ్ఞులకు అర్థం కాకపోదు.

మహిలో ఏవేవో జరుగుతాయి. ఎన్నెన్నో జరుగుతాయి. జరిగే వాటిని ఆపడానికి చేసే ప్రయత్నం కన్నా, వాటి వల్ల మనస్సులో ఏమీ జరగకుండా జాగ్రత్త పడటం శ్రేయోదాయకము.

మనస్సును అనుక్షణం అలా జాగృతం చేస్తూ జీవించాలి. బాధ్యతను బుద్ధికి పట్టించాలి.

నీ చేతిలో రాళ్ళు లేవు.

ఉన్నవన్నీ పువ్వులే. నీవి పూలదోసిళ్ళు.

అర్థం చేసుకో.

అంతా చేతి లోనే ఉంది.

సమస్తమూ చేతల లోనే ఉంది.

ఎవరి చేత లైనా చేతుల నుండే కదుల్తాయి. చేతుల నుండి కదిలే చేతలకు చిత్తాలే మూలస్థానాలై ఉంటాయి. ఆంతర్యంలో చలించే చిత్తభ్రమలు, చిందులాటలు ఎవరికీ కనిపించవని, వినిపించవని భావించి దారి తప్పిన వ్యక్తులు చేయరానివి చేస్తూ, బ్రతుకులను ఛిద్రంగా మార్చుకుంటూ ఉంటారు.

ధన గర్వంతో కొందరు అకృత్యాలకు నిలయంగా మారుతారు. అక్షర జ్ఞానంతో మరి కొందరు వికృతాలతో విలయతాండవం చేస్తూ ఉంటారు. అలాంటి వారికి అర్థం కావలసింది ఒకటుంది.

దారి తప్పిన జ్ఞాన ధనాలు దుర్యోధనునికి లేక పోలేదు. రావణుడికి పుష్కలంగా ఉన్నాయి. కాని, వారికి లేనిది గోవిందు డొక్కడే. ఈ కారణం గానే వాళ్ళ బ్రతుకులు బుగ్గి పాలయ్యాయి.

చిత్తము లోని చిందులాటలు చిద్రూపుడైన పరమేశ్వరునికి తెలుసు.

చేతులు ఏం చేస్తున్నాయో *కరమధ్యేతు గోవిందః* - అరచేతిలో ఉండేవాడు అవలోకిస్తూనే ఉన్నాడు.


ప్రయత్నిస్తే, కర్మల నుండి ఎవరైనా తప్పుకో గలరేమో గాని, ఎంత ప్రయత్నించినా కర్మఫలాల నుండి ఎవ్వరూ తప్పుకో లేరు. ఈ సత్యం తెలిసిన వారికి ఉన్నది తెలివి. ఈ సత్యం తెలియని వారికి లేనిది తెలివి. అంతే తేడా.

బొక్కలు వెతికేది నక్క.


చెప్పులు వెతికేది కుక్క.

ఈ వెతుకులాటలు, అగచాట్లు లేని పవిత్రమైన మానవ జన్మ మనకు ప్రాప్తించింది. సద్వినియోగం చేసుకుంటే బ్రతుకులలో వెన్నెలలు విరబూస్తాయి. దుర్వినియోగం చేసుకుంటే, నేడు కాకపోయినా, భవిష్యత్తులో దుఃఖమే బ్రతుకుకు నేస్తం అవుతుంది. ఇది సత్యం. సత్యం. ముమ్మాటికీ సత్యం.

స్వామి సుందర చైతన్యానంద



సంస్కృతవాణీ-సుందరవాణీ



డా॥ దోర్బల ప్రభాకర శర్మ
ప్రిన్సిపాల్ (రిటైర్డ్), ప్రభుత్వ సంస్కృత కళాశాల
కొవ్వూరు

పల్లవి : శంకరవాణీ - సద్గురువాణీ
సంస్కృతవాణీ - సుందరవాణీ

చరణము (1) : సంస్కృతి భవన వినిర్మితి వాణీ
సంప్రదాయ గృహ రక్షణవాణీ
అష్టాదశ విద్యాఉఉకర మురలీ
గాన హృష్ట హరి మందిర వాణీ ॥ శంకర ॥

చరణము (2) : విశ్వధర్మ విజ్ఞాన ద వాణీ
విశ్వ సఖ్య విధి దీక్షిత వాణీ
విశ్వ సమైక్య విధాయక వాణీ
విశ్వాభయ, ధృతి వైభవవాణీ ॥ శంకర ॥

చరణము (3) : శతసహస్రముఖ శతముఖవాణీ
శారద నీరద గర్జిత వాణీ
ఋషి ముని కవి బుధ ఋత హిత వాణీ
హిందు ధర్మ కంఠీరవ వాణీ ॥ శంకర ॥


చరణము (4) : వేదోపనిషద్రహస్యవాణీ - సకల శాస్త్రసుపురాణీ వాణీ
శ్రీ సుందరచైతన్యానంద స్వామి కావ్య సంగీతవాణీ
శ్రీ సుందర చైతన్యానందస్వామి రూప గీతార్థా వాణీ
శ్రీ సుందర చైతన్యానంద స్వామ్య, ద్వైత సుధారసవాణీ
॥ శంకర ॥

పరమ మంగళ సద్గురు దేవా!

చైతన్య భజన

శ్రీమతి సి.పద్మ

పల్లవి: పరమ మంగళ సద్గురు దేవా!
ముక్తి ప్రదాయక మమ గురుదేవా! ॥ పరమ ॥



చరణములు:

1. బ్రహ్మానంద సాగరరూపం
అఖండ మహిమా అద్భుతరూపం
నిగమాతీత నిర్మలరూపం
వేదవేదాంత బోధ స్వరూపం ॥ పరమ ॥

2. అనంతరూపా అనంతనామ
అద్భుతచరిత ఆనందదాత
కైవల్యదాయక కరుణాంతరంగ
ప్రణవస్వరూప హృదయాంతరంగ ॥ పరమ ॥

సూర్యుడి వల్లనే పద్మం వికసిస్తుంది. వెలుగు వల్లనే చీకటి పోతుంది. మరొక కారణం వల్ల పద్మం వికసించదు. మరో మార్గంలో చీకటి పోదు. హృదయపద్మం విరబూయాలన్నా, అజ్ఞాన చీకట్లు పోవాలన్నా జీవితంలో గురుభాస్కరుడు ఉదయించినపుడే.

తల్లిగర్భంలో తొమ్మిది మాసాలు అంధకారంలో గడిపిన బిడ్డ ప్రపంచంలోకి వస్తూనే వెలుగును చూడగలుగుతాడు. అనేక జన్మల్లో అజ్ఞానంలో పడి ఉన్న జీవుడు ప్రమాణం అందుతూనే సత్యాన్ని దర్శించగలుగుతాడు. ఆత్మజ్ఞానానికి శాస్త్రమే ప్రమాణం. శాస్త్ర ప్రమాణాన్ని అందించే పరమ ప్రేమావతారమే గురుమూర్తి. శాస్త్రం ఆత్మజ్ఞానాన్ని తనలో నిక్షిప్తం చేసుకొని ఉన్నా తనకై తాను ప్రకటితం కాదు. అంతే కాదు. శిష్యుడు తనకై తాను అధ్యయనం చేసి అర్థం చేసుకోవాలని అనుకున్నా శాస్త్ర హృదయం అతనికి అవగతం కాదు. శిష్యుడి చేతిలో శాస్త్రం, తాళంచెవి లేని భాండాగారం వంటిది.

డబ్బు సంపాదించి బిడ్డల్ని పోషించేది తండ్రే అయినా, అన్నం పెట్టి ఆకలి తీర్చేది తల్లి. ఆకలి తీర్చే అమ్మే లేకపోతే తండ్రి ఆర్జించే ధనానికి అర్థమే లేదు. అదే విధంగా వేదసాగరంలో జ్ఞానమణులు పుష్కలంగా నిక్షిప్తమై ఉన్నా వాటిని వెలికి తీసి పంచిపెట్టే ఆచార్యుడు లేనపుడు జ్ఞానలేమిలో జనులు దుఃఖించవలసిందే.

ఎంత పిలిచినా 'రాను రాను' అంటూ మారాము చేస్తూ ధూళిలో ఆడే బిడ్డను తల్లి ఎంతో గారాబంగా ఎత్తుకొని లాలపోసి, బువ్వ పెట్టి, జోలపాడి నిద్రబుచ్చినట్లు, 'నేను

నేను' అంటూ ఊరేగే మనస్సును 'నేనే నీవ'ని చేరదీసి, అహంకార మాలిన్యాన్ని కడిగి, జ్ఞానభిక్షను పెట్టి, శాంతిలో పవ్వళింపచేస్తాడు ఆచార్యదేవుడు.

ప్రేమ ఒకరి నుండి ఒకరికి ప్రవహిస్తుంది. జ్ఞానం తనలో తాను ప్రకాశిస్తుంది. ఆర్తితో సమీపించినపుడు గురుదేవుడే కదిలి ప్రేమగా ప్రవహిస్తాడు. కన్నీళ్ళను తుడిచి కలతలను బాపుతాడు. శిష్యుడివై శరణు అన్నప్పుడు ఆయన జ్ఞానమై ప్రకాశిస్తాడు. కళ్ళలో జ్ఞానాంజనాన్ని దిద్ది దృష్టిని జ్ఞానమయం చేస్తాడు. ప్రేమ, జ్ఞానం కలబోసిన అమృత స్వరూపమే ఆచార్యుడు.

మనకు ఏమి కావాలో తెలియని అజ్ఞానదశలో కూడా మన హృదయంలో పరమాత్మ దాగి ఉన్నాడు. నాకు మోక్షమే కావాలి అని తెలుసుకున్న నాడు ఆ పరమాత్మే గురు పరమాత్మగా బాహ్యంలో దర్శనీయుడౌతాడు. సత్యానికి సన్నిహితంగా తీసుకెళ్ళేది ప్రేమ. నీవే సత్యమని తెలిపేది జ్ఞానం.

తల్లిపక్షి దూరతీరాలకు ఏగి నోటితో ఆహారాన్ని కరచి తెచ్చేది ఆకలితో ఉన్న పిల్ల పక్షుల కోసమే కాని తన కోసం కాదు. తల్లి ఎంతదూరం ఎగురుతుందో, ఎక్కడెక్కడ తిరుగుతుందో, ఆహారంగా ఏమి తెస్తుందో పిల్లలకు తెలియదు. తల్లి గూటికి తిరిగి రాగానే చిన్ని చిన్ని నోళ్ళను పెద్దగా తెరచి, మెడలు చాచి, తలలు పైకెత్తి తిండిగింజల కోసం అరుస్తూ తల్లి చుట్టూ మూగుతాయి. ఒక్క నోటితో అన్ని నోళ్ళకు తినిపించి మరు క్షణమే రివ్వున ఆకాశంలోకి ఆహారానికై ఎగిరిపోతుంది తల్లిపక్షి. ఆకలి తీరి, అరుపులు ఆగి, గూటిలో నిశ్శబ్దం గూడు కట్టుకుంటుంది. అలుపెరుగని శ్రమ, అంతులేని ప్రేమ ఆ తల్లిపక్షిది.

గురుదేవుడిది ఎన్ని జన్మల సాధనో మనకు తెలియదు. ఎంత దీర్ఘ అధ్యయనమో మన మెరుగము. ఎంత తీవ్ర తపస్సో ఊహకు అందదు. మనం ఆర్తితో ఉన్నామని, అజ్ఞానంలో అలమటిస్తున్నామని మాత్రమే మనకు తెలుసు. గురుపాదాల వద్ద స్థానాన్ని పొందేందుకు, మన స్థాయిని మరువకుండా జీవించేందుకు ఈ మాత్రం తెలిస్తే చాలు.

అవిరళ శ్రమ గురుదేవుడిది. అలుపెరుగని గళం గురుభగవానునిది. అర్హతను బట్టి గురువు ఎప్పుడేమి అందిస్తాడో మనకు తెలియదు. అందుకనే యోగ్యతను కలిగి ఉండడమే మన ముందు ఉన్న ఏకైక కార్యం. ఈ రోజు శిష్యుడు తనకు అంతో ఇంతో తెలుసు అని అనుకున్నా, అదంతా మెల్లమెల్లగా, తల్లిలాగా, దాచుకోకుండా గురువు తినిపించిన గోరు ముద్దలే కదూ! ఈనాడు తాను ఎంతో తెలివైనవాడు అని శిష్యుడు అనుకున్నా తన మనస్సులో వెలితి తొలగనంత వరకు, తన జీవితంలో శాంతి నిండనంత

వరకు సుందరరూపుడు, చైతన్య స్వరూపుడు, ఆనందసాగరుడు అయిన గురుదేవునిలో తాను ఒక బిందువు మాత్రమే నని శిష్యుడు మరువరాదు. ఈ ఎరుకే, ఈ గమనికే ఒకనాడు శిష్యుడిని పూర్ణరూపునిగా తీర్చిదిద్దుతుంది.

పుట్టుక మంగళం, చావు అమంగళం అని మనందరి భావం. మరి ఈనాటి పుట్టుకకు ఒకనాటి చావే కారణమని ఎందుకో గుర్తించలేము. ఒక ఇంటిలో సూతక స్నానాలు. మరొక ఇంటిలో పురుటి స్నానాలు. ఈ ప్రపంచం అణువణువునా శ్మశానమే. అనుక్షణం ప్రసూతి గృహమే. ఆవిరైన నీరే తిరిగి మేఘమై వర్షిస్తుంది. బీజం నశిస్తేనే మొక్క అంకురిస్తుంది. ఆకులు రాల్చిన చెట్టే మరలా చిగురిస్తుంది. పుట్టింటిని విడిచిన వధువే మెట్టినింటికి మంగళప్రద మౌతుంది. ఒకరి ఇంటిలో కన్నీరే మరొకరి ఇంటిలో పన్నీరు. ఒకరితో వియోగమే మరొకరితో సంయోగం. శుభాశుభాలకు అతీతమై, సంయోగ వియోగాలకు పరమై, సర్వమంగళంగా, నిత్యమంగళంగా, పరమమంగళంగా శోభించే జ్ఞానమే గురుదేవుడి స్వరూపవైభవం. అందుకే,

పరమ మంగళ సద్గురుదేవా!
ముక్తి ప్రదాయక మమ గురుదేవా!

అంటూ, భక్తిభావనతో, ముక్తకంఠంతో గురుబిడ్డలు గొంతెత్తి గురుదేవుడిని భజిస్తూ ఉన్నారు.

సాగరం పూర్ణత్వానికి సంకేతం. పూర్ణమైనదే సత్యమై భాసిస్తుంది. సత్యం ఒకటే కాని రెండు ఉండేందుకు వీలులేదు. అయినా, శిష్యుడు సంసార సాగరంలో మునిగిపోతూ ఉన్నాడు. గురువు ఆనందసాగరంలో ఓలలాడుతూ ఉన్నాడు. ఇరువురూ ఉన్నది ఈ ప్రపంచంలోనే. మరి సంసారదుఃఖం సత్యమా? లేక ఆత్మానందం సత్యమా? ఈ ప్రశ్నకు సమాధానం ఎవరు చెప్పాలి? తెలిసినవారు తెలియనివారికి చెప్పాలి. సంసారం సాగరం కాదు, కేవలం భావనే అంటూ త్రుటిలో సంసారాన్ని అదృశ్యం చేసే గురుదేవుడు అద్భుతరూపుడు.

లేనివి సృష్టించి ఇవ్వడం మహిమ కాదు. ఉన్న సత్యాన్ని దర్శింపచేయటమే మహిమ. ఈ సృష్టే మాయా కార్యమైనపుడు ఎంత ఉన్నా 'ఇంకా ఇంకా' అంటూ అర్రులు చాచే వారికి ఏది సృష్టించి ఇస్తే మాత్రం ఏమి సుఖం? ఉన్న అజ్ఞానాన్ని, దుఃఖాన్ని పెంచడం తప్ప. 'ఉన్నవన్నీ ఒకనాడు పోయేందుకే. నేడు ఉన్నట్లు ఉన్నా నిజానికి అవి లేనివే. ప్రపంచం ప్రపంచంగా మిథ్య. ప్రపంచం పరమాత్మగా సత్యం. అదే నేను. అదే నీవు. ఉన్నది నేనే. నేనే నీవు', అంటూ అఖండ ఆత్మను వేదాంతవిద్య ద్వారా దర్శింప చేసే గురుదేవుడు పూర్ణబోధ స్వరూపుడు. అందుకే,

బ్రహ్మానంద సాగర రూపం, అఖండ మహిమ అద్భుతరూపం
నిగమాతీత నిర్మలరూపం, వేదవేదాంత బోధ స్వరూపం


అంటూ గురుబోధ యొక్క ప్రాశస్త్యాన్ని ఈ చరణంలో శిష్యులు ప్రస్తుతిస్తున్నారు.

ఈ ప్రపంచంలో నామరూపాలు అనంతంగా గోచరిస్తూ ఉండినా, అన్నిటికి ఆధారమై, అధిష్ఠానమైన పరబ్రహ్మము ఏకమై, అద్వయమై ఉన్నాడు. అవ్యక్తమైన ఆ అద్భుత ఆత్మను దర్శింపజేయు గురుదేవుడు అద్భుతచరితుడు. అద్భుతమైన తన రూపదర్శనంతో, నామ వైభవంతో శిష్యులకు సదా ఆనందాన్ని ఒసగే గురుదేవుడు తీరా దగ్గరకు వచ్చిన తరువాత 'నామ రూపాలు నావే, కాని నేను నామరూపాలు కాదు' అంటూ అదృశ్య మౌతాడు. గురుదేవా! కరుణాంతరంగా! కానరావా! అంటూ కన్నీరు మున్నీరవుతున్న శిష్యుల హృదయాలలో ప్రణవనాదమై వినిపిస్తాడు. ప్రజ్ఞానఘన రూపుడై ప్రకాశిస్తాడు. గురుదేవుడు ఏకఛత్రాధిపతిగా ఏలే హృదయ సామ్రాజ్యం కైవల్యధామమే. అన్యమైనవాటికి తావివ్వని అఖండ ఆనందసాగరమే. అందుకే,

అనంతరూపా అనంతనామా అద్భుతచరితా ఆనందదాత
కైవల్యదాయక కరుణాంతరంగ ప్రణవస్వరూప హృదయాంతరంగ

అంటూ గురుదేవుని నామరూప గుణ వైభవాన్ని గళమెత్తి గానం చేస్తున్నారు గురుబిడ్డలు. కారే కన్నీటినే ఎదుటివారు చూడగలరు, తుడువగలరు. రోదించే మనస్సును హృదయాంత రంగుడైన గురుదేవుడే గుర్తించగలడు, ఓదార్చగలడు. చూచేవి కళ్ళైనా అర్థం చేసుకునేది మనస్సు. కళ్ళు చూడలేని వాటిని మనస్సు అర్థం చేసుకోగలుగుతుంది. గురువు కనిపించేది బాహ్యంలో అయినా ఆయన నివసించేది శిష్యుడి హృదయంలో. శిష్యుడి జీవితంలో ఆరని కాంతి, మారని శాంతి, అఖండమైన దీప్తి గురుభగవానుడే.

జై జై గురుదేవ!



జగద్గురు జీవితము

ధారావాహిని-1

స్వామి సుందర చైతన్యానంద

నాటికీ నేటికి మధ్య పన్నెండు వందల సంవత్సరాలు గడచిపోయాయి. నేటి వలె నాటి భారతం కూడా ఆటుపోట్లతో రాటుదేలిన సమయం అది. ఒకనాటి అసమాన వైభవం నాటి భారతంలో కనుమరుగైన రోజులవి. **ఆనాడు...**



అదొక దుర్దశ. ఈ ఋషి భూమికి చల్లటి నీడ నిచ్చిన సనాతన ధర్మవృక్షం కళావిహీనమై, కాంతిశూన్యమై విలవిల లాడుతూ విలపించిన దుర్గతిని దర్శింపజేసిన దౌర్భాగ్యదశ. దురాగతాలు, దురాలాపాలు, దురభిమానాలు, దుర్వార్తలు దూకుడు అందుకున్న దుర్ముహూర్త దశ. దురభ్యాసాలు, దురభిప్రాయాలు, దురాశలు, దుశ్చేష్టలు కలసి స్వర్గతుల్యమైన ఈ కర్మభూమిలో దుర్భిక్షమును ఆవిష్కరించిన దురదృష్ట దశ.

విభిన్న విచిత్ర వాదాలు అనే వేడి గాడ్పులకు సనాతన ధర్మవృక్ష పల్లవాలు కలత చెంది వాడిపోయాయి. అసహన అపవాద అనాచారాల పెనుగాలులకు వాడిన ఆకులు ఊడి రాలిపోయాయి. శుష్క పాండిత్యాలు, శూన్య హృదయాలు రేపిన మారణ హోమాలు సంస్కృతీవృక్షాన్ని కొమ్మలు విరిచి నేల కూల్చాయి. సత్యం పేరిట చెలామణీ అయిన కువిద్యలు ధర్మవృక్ష ఫలాలను నేల రాల్చాయి. పరస్పర ద్వేష భావాలతో సాగించిన సిద్ధాంత రాద్ధాంతాలు ఫలించనున్న కాయలను ధ్వంసం చేశాయి. ఈ విధమైన దురదృష్టకర సంఘటనలతో మోడుబారిన సనాతన ధర్మవృక్షాన్ని పరిరక్షించే వారు కనబడక అనాథవలె నాటి భారతం అలమటిస్తూ నిరీక్షిస్తున్నది.

సత్యాన్ని అందలం ఎక్కించిన హరిశ్చంద్ర భూపతి పాలించిన పుణ్యభూమి ఇదేనా? జన కళ్యాణాన్ని జగతిలో ఆవిష్కరించిన జనకుని జే గంటలు మ్రోగిన కర్మభూమి ఇదేనా? పక్షిని రక్షించే ప్రయత్నంలో తన శరీరం కోసి ఇచ్చిన శిబి చక్రవర్తి చరించిన త్యాగ భూమి ఇదేనా? ధర్మరక్షణకై సింహాసనాన్ని త్యజించి కానలకు వెళ్ళిన రామచంద్రుని జన్మభూమి ఇదేనా? శాంతి ప్రేమలకై నిర్విరామంగా శ్రమించి, భాగ్యవంతుడైనా బాధలనే వరించిన శ్రీకృష్ణుడు నర్తించిన జ్ఞానభూమి ఇదేనా?

ఎందరో మహాత్ములు గతంలో ఆవిర్భవించారు. ఈ ధర్మవృక్షాన్ని పెంచి పోషించారు. రక్షించారు. దివ్యమైన ఆ ధర్మవృక్షం క్షీణించే దుర్దశ సమీపించింది. దీనిని రక్షించే వారెవరు? దానికి పచ్చని రూపాన్ని ప్రసాదించే వారెవరు?

అజ్ఞాన విషవాయువుల వల్ల వికృతమై మోడుబారిన సనాతన ధర్మవృక్షంపై నవ వసంత మాలికలా విజ్ఞాన లతలు అల్లుకపోయేది ఎప్పుడు?

నిరాశా చీకట్లు ముసిరిన సమాజంలో ఆనంద జ్యోతులు వెలిగే దెప్పుడు? అజ్ఞానమనే కారుమబ్బులు అంతరించేది ఎప్పుడు? విజ్ఞాన చంద్రోదయంతో నూతన అవగాహన చిగురు వేసేది ఎప్పుడు? శాంతి మందిరానికి తలుపులు తెరిచేది ఎప్పుడు? తొలి గంటలు మ్రోగించేది ఎప్పుడు?

దులపాలి పట్టిన బూజులు
రావాలి మనకా రోజులు

బూజు దులిపే రోజు రానే వచ్చింది. మబ్బులన్నీ కరిగాయి. దిక్కులన్నీ వెలిగాయి. ఆనందంతో నింగి చూసింది. కన్నీరు పన్నీరుగా మారే శుభ సమయం ఆసన్నమైంది.

సనాతన ధర్మ వృక్షాన్ని చిగురింప జేసి అనాథను సనాథగా మార్చే దివ్యాత్ముడు అవతరించ నున్నాడు. ద్వైతచీకట్లను తొలగించే అద్వైత ఆనందమూర్తి ఆవిర్భవించ నున్నాడు. ఎవరా దివ్యమూర్తి? అమృత స్ఫూర్తి! ఆనంద దీప్తి. అడుగో . . . అతడే. కేరళ దేశంలో పెరియారు నదీ తీరాన కాలడి అనే గ్రామంలో ఆర్యాంబ శివగురు అనే పుణ్య దంపతులు జీవించేవారు. భక్తితత్పరులైన ఆ పుణ్య దంపతులకు చాలా కాలం సంతానం లేదు. వ్రత తపోదానాదులు ఆచరించినా వారికి సంతాన ప్రాప్తి కలుగ లేదు.

కేరళ దేశంలో 'తిరుచూరు' లో వృషాచలం అనే గొప్ప శివక్షేత్రం ఉంది. 'వృష' యనగా నందికేశ్వరుడని భావం. ఈ క్షేత్రంలో నందీశ్వరుడు శ్వేత వర్ణంతో భాసిస్తూ ఉంటాడు. ఈ పుణ్య క్షేత్రంలో ఒకటి రెండు మాసాలు నివసించి, నిత్యం పరమశివుని సేవించి, ఆలయంలో పవిత్ర నిద్ర పొందే భక్తులకు పరమేశ్వరుడు స్వప్నంలో దర్శనమిచ్చి అనుగ్రహిస్తాడని ప్రతీతి.

సంతానాభిలాషతో ఆర్యాంబ శివగురులు తిరుచూరు చేరి అక్కడి వృషాచలేశ్వరుని సేవించారు. ఒకనాడు మహేశ్వరుడు శివగురునికి స్వప్నదర్శనం ఇచ్చి 'మీకు అల్పాయుష్కుడైన జ్ఞానవంతుడు బిడ్డగా కావాలా? లేక దీర్ఘాయువు అయిన అయోగ్యుడు పుత్రుడుగా కావాలా?' అని ప్రశ్నించాడు.

'తండ్రీ! గంగిగోవు పాలు గరిటె డైనను చాలునని ఆర్యోక్తి. దీర్ఘకాలం జీవించే అప్రయోజకుడి కన్నా అల్పాయుష్కు డైనను జ్ఞాని అభిలషణీయుడు. మమ్మల్ని అనుగ్రహించండి' అని ఆ దంపతులు ప్రార్థించారు.

శివగురు నిద్ర లేచాడు - ఆయన ముఖారవిందం దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నది. ఆర్యాంబ భర్తను సమీపించి నమస్కరించింది.

'దేవీ! మహేశ్వరుడి లీలలు మానవులకు అనూహ్యములు. నిన్ను సంప్రదించకుండా నే నొక పని చేశాను. నా కార్యం నీకు సంతోషం కలిగిస్తుందో లేదా దోషంగా కనిపిస్తుందో నా ఊహకు అందడం లేదు. మహేశ్వరుడు నాకు స్వప్నదర్శనం ఇచ్చి వరం అనుగ్రహించగా నేను నా భావం వెల్లడించాను. ఇది మన ఇరువురికి సంబంధించిన విషయం. నేను ఒక్కడినే నిర్ణయించడం ఎంత వరకు ధర్మమో నాకు తెలియడం లేదు' అని స్వప్న వృత్తాంతం వివరించాడు.

'నాథా! ఈశ్వర సంకల్పమే ఫలిస్తుంది. ప్రభూ! పరమేశ్వరుడు నాకు కూడా స్వప్న దర్శనం ఇచ్చాడు. మీ లాగే నన్ను కూడా ప్రశ్నించాడు. నా అభిప్రాయం కూడా మీ అభిప్రాయాన్నే అనుసరించింది. నా భావం మీ భావాన్నే అనుసరించడం నా భాగ్యం. నేను ధన్యురాలను. అల్పాయుష్కుడైనా మనకు పుట్టబోయే బిడ్డ జ్ఞాని' యని ఆర్యాంబ మురిసి పోయింది. ఆమెను చూసి శివగురువు కూడా సంతోషించాడు.

ఆర్యాంబ శివగురుల వంటి దంపతులున్న సమాజం మంగళకరమై శోభిస్తుంది. మహోన్నతమై భాసిస్తుంది. తమ బిడ్డ సుపుత్రుడు కావాలని తలచి తత్సిద్ధికై యత్నించే వారే నిజమైన తల్లిదండ్రులు.

నేడు ఈ విధమైన భావసంపద ఎందరికి ఉంది? ఇలాంటి ఆలోచనా సరళి కలిగిన తల్లిదండ్రులు ఎందరున్నారు? బాగు తెలియని వారు ఎవరిని బాగు చేయగలరు?

అధర్మంగా చరించి అయినా తమ పుత్రుడు విద్యాధికుడు కావాలని కొందరి తపన. అక్రమ మార్గమైనా ఫరవాలేదు తమ బిడ్డ గొప్ప ఉద్యోగి కావాలని మరి కొందరి యాతన. దౌర్జన్య హింసాదులను ఆశ్రయించి అయినా తమ కుమారుడు నాయకుడు కావాలని ఇంకకొందరి వేదన. దగాకోరైనా నష్టం లేదు. పుత్రుడు ధనాన్ని ఆర్జిస్తే చాలని మరి కొందరి ఆకాంక్ష. ఈ విధమైన నిమ్న భావాలతో బిడ్డలను అప్రయోజకులుగా తీర్చే తల్లిదండ్రులున్న సమాజం అభ్యుదయాన్ని దర్శించ లేదు. ఆదర్శాన్ని పాటించ లేదు.

తాత్కాలిక సుఖాలను వాంఛించి, శాశ్వత విలువలను పాతి పెట్టే మనుషులున్న సమాజంలో కింకరులు కనిపిస్తారే గాని శంకరులు గోచరించరు.

ఆర్యాంబ శివగురులు పూర్ణహృదయులై కాలడి చేరారు. ఆర్యాంబ హృదయం శాంతిసాగర మైంది. బుద్ధి కాంతిమయ మైంది.

వైశాఖ శుక్ల పంచమి నాడు ఆర్యాంబ పుత్రుని ప్రసవించింది. జగత్కళ్యాణాన్ని కాంక్షించిన ఆ పుణ్య దంపతులకు జగద్గురువే బిడ్డగా జన్మించాడు. ***(సశేషం)***

పంచరత్నమాల

కురాకుల వెంకట నరసయ్య, యమ్.ఎ.
రిటైర్డ్ సి.హెచ్.ఓ., అనంతపురం.

1. సమ్మోహనాస్త్రాన్ని సంధించినారేమో
    మూగిన జనమంత ముగ్ధులైరి
గంటల కాలమ్ము గడచిన దెట్టులో
    తెలియకున్నది మాకు తేరి చూడ
వేదాంత సారాన్ని వివిధ రీతులలోన
    వడబోసి చెప్పిన వక్త మీరు
అద్వైత సిద్ధాంత ఆధిక్య ధిషణతో
    వట్టి సిద్ధాంతాల వమ్ము చేసే
వందల యజ్ఞాలు వరుసగా చేసేసి
    పుణ్యాన్ని పంచిన పుణ్యశాలి

అట్టి సుందర చైతన్య గట్టివారు
భరత భూమిలో పుట్టగా భాగ్యమబ్బె
భారతీయుల భాగ్యమ్ము పరులకెద్ది
స్వామి సుందరచైతన్య సాధు చరిత!

2. స్వామిజీ పలికిరా సభికుల మనసులు
    ఆధ్యాత్మలోకాల ఆడుకొనుచు
వారలు కదలిరా వారిలో ఠీవులు
    మృగరాజు ఠీవిగా భ్రాంతి కలిగె
స్వాములు నవ్విరా సభలోన యంతటా
    రతనాలు గలగల రాలిపోవు
వేదాంత సారాన్ని వివరంబుగా చెప్పి
    ఉర్రూతలూగించె ఉన్న జనుల
అజ్ఞాన తిమిరాలు అవలీల పోగొట్టి
    వెలుగును పంచిన వేత్త మీరు

వారి పలుకు పలుకు పలికించె మధురంబు
మాట మాట మాకు భక్తి మూట
పదము పదము మాకు మోదము కలిగించె
పాట పాట మాకు బాట కాగ

3. ఖంగుమనె మీది కంఠంబు గంట వోలె
జయము ఆచార్య చైతన్య జయము జయము
జన్మజన్మల సంస్కార సారమేమొ
గురువు శిష్యుల బంధంబు కూడె నిపుడు

4. హావభావములతో అందంగ చెపుచుంటె
చిటిక చిటిక మమ్ము చిత్తు చేసె
సుందరంగ తమరు సూక్ష్మాలు చెపుచుంటె
రంగరంగ వెలుగు రంగరించె

5. భక్తి జ్ఞానంబు వైరాగ్య భావమంత
కలిపి కలపంగా వడబోసి గట్టిదంత
పాంచజన్యము మూలాన పంచినారు
వందనంబులు తమరికి వందనాలు

ఆచార్య శ్రేష్ఠులు - శ్రీ శంకర భగవత్పాదులు

('చైతన్య భగవద్గీత' ప్రథమ భాగము - ఉపోద్ఘాతము నుండి)

గీతా వ్యాఖ్యానాలు - శ్రీ శంకర భాష్యము

భగవద్గీతపై అనేక వ్యాఖ్యానాలు వెలువడ్డాయి. ఇంకా వెలువడు తున్నాయి. ఈ భాష్యాలలో ప్రముఖ మైనది, ప్రాచీన మైనది శ్రీ ఆదిశంకరాచార్యస్వామి రచించిన భాష్యము.

శ్రీ శంకరులకు పూర్వము కూడా భగవద్గీతకు వ్యాఖ్యానము వ్రాసిన వారు ఉన్నారు. అవి గీతా హృదయాన్ని ఆవిష్కరించ గలిగి ఉంటే, శ్రీ శంకరులు గీతకు భాష్యం వ్రాసి ఉండే వారు కారు. వాస్తవం చెప్పాలంటే, అవి యథావత్ గీతా హృదయాన్ని ఆవిష్కరించక పోగా, వక్ర భాష్యాన్ని కూడా వినిపించాయి. అందుచేత ఆచార్యుల వారు గీతాభాష్యానికి శ్రీకారం చుట్ట వలసి వచ్చింది. ఆచార్యుల వారికి పూర్వము బోధాయనుడు అనే వ్యక్తి గీతకు వ్యాఖ్యానము రచించాడు. అతనిని వృత్తికారుడు అని కూడా అంటారు. అతడు జ్ఞానకర్మ సముచ్చయ వాదాన్ని ప్రతిపాదించాడు. ప్రవృత్తి నివృత్తులను గూర్చి ఇప్పుడే మనం సంక్షేపంగా చెప్పుకున్నాం. గ్రంథంలో మున్ముందు సహేతుక మైన తర్కంతో విస్తారంగా చర్చించడం మీరు చూస్తారు.

ప్రస్తుతం మనం చూచి నంత వరకు కర్మయోగ, జ్ఞానయోగాల మధ్య సాధన సాధ్య సంబంధాన్ని చూశాం. ఉపాయ ఉపేయ సంబంధంగా అర్థం చేసుకున్నాం. జ్ఞానం ద్వారానే మోక్షం ప్రాప్తిస్తుంది. మోక్షానికి జ్ఞానమే సాధనం **(జ్ఞాన మేవ సాధనం).** జ్ఞానప్రాప్తికి అంతఃకరణ శుద్ధి అవసరం కనుక, దానికి కర్మయోగము సహకరిస్తుంది. ఉపకరిస్తుంది. ఇదీ ఉన్న విషయం. వృత్తికారుడు ప్రతిపాదించే జ్ఞానకర్మ సముచ్చయము విచిత్రమైన వాదము. కర్మ, జ్ఞానము కలిసే మోక్షాన్ని ఇస్తాయి అనేది బోధాయనుని అభిప్రాయము. జ్ఞానకర్మలు రెండిటిని ఒకే మనిషి ఒకే కాలంలో ఆచరించడం సాధ్య పడదు. కారణం, అవి గతి - స్థితుల వలె పరస్పర విరుద్ధ మైనవి.

ఒకే కాలంలో ఒకే వ్యక్తి నడవాలి - నడవకుండా నిలబడాలి (గతి - స్థితి) అంటే సాధ్యమేనా? ఇంత అశాస్త్రీయ మైన విషయం వృత్తికారుడికి వంట బట్టింది. పోనీ, అది అతని అభిప్రాయం అని సరిపెట్టు కుందాము అంటే, అదే గీతాహృదయ మని వ్యాఖ్యానిస్తూ, గీతకు జ్ఞానకర్మ సముచ్చయ వాదాన్ని అంట గట్టాడు. వృత్తికారుని మతాన్ని గీతాభాష్యంలో అనేక చోట్ల నామ ప్రసక్తి లేకుండా ఆచార్యుల వారు నిశితంగా ఖండించారు.

తదిదం గీతాశాస్త్రం సమస్త వేదార్థ
సార సంగ్రహ భూతమ్ దుర్విజ్ఞేయార్థం

ఈ గీతాశాస్త్రము సమస్త వేదార్థ సార సంగ్రహ భూతమై ఉన్నందున, దాని అర్థాన్ని యథావత్ గ్రహించడం సులభసాధ్యం కాదు. చాలా కష్టమైన కార్యము అంటూ భాష్య

పీఠిక లోనే ఆచార్యులు వ్యాఖ్యానించారు. నేను ముందుగానే తెలియ చేసినట్లు, పూర్వ వ్యాఖ్యానాలు ఉండగా, మళ్ళీ ఆచార్యుల వారు భాష్యాన్ని ఎందుకు రచించారు? అనేది పూర్వపక్షము.

వ్యాఖ్యానాలు ఉండినా, అవి విరుద్ధ భావాలను వ్యక్తం చేయడం వల్ల, వాటిని పఠించే వారు విరుద్ధ భావాలను గ్రహించడమే గాక, ఆ విరుద్ధ భావాలు గీత లోనే ఉన్నాయని కొందరు అంటూ ఉండటం వినిన ఆచార్యులు, ఈ విరుద్ధార్థ గ్రహణాన్ని నివారించి, స్పష్టమైన అర్థాన్ని ఋజుమార్గంలో అందించ డానికి భాష్యాన్ని వ్రాయవలసి వచ్చింది అని స్వయంగా చెప్పడం జరిగింది **(అహం వివేకతః అర్థ నిర్ధారణార్థం సంక్షేపతః వివరణం కరిష్యామి).**

ఆప్త ప్రణీతము

గ్రంథ విషయము విస్పష్టంగా, సులభగ్రాహ్యంగా ఉంటే, దానిని వ్యాఖ్యానించ నవసరం లేదు. మూల గ్రంథము లోని విషయాన్ని గ్రహించడం దుస్సాధ్య మైనపుడే దానికి వ్యాఖ్యానము అవసరమై ఉంటుంది. మూలానికి వ్యాఖ్యానము తోడై నపుడు విషయం స్పష్టమై సులభగ్రాహ్యం కావాలి. అలా విషయాన్ని సులభ తరం చేసే విధంగా వ్యాఖ్యానించా లంటే వ్యాఖ్యాత ఆప్తుడై ఉండాలి. అతని వ్యాఖ్యానము ఆప్తప్రణీతంగా ఉండాలి. ఆప్తుడు అంటే యథార్థమును వచించు వాడు అని అర్థము. ప్రామాణికుడు అని భావము. ప్రమాణ విషయాన్ని విడిచి పెట్టకుండా, అప్రమాణ విషయాలను జోడించకుండా విషయాన్ని ఉన్నదున్నట్లు సుస్పష్టంగా అందించ గలిగే వాడు ఆప్తుడు. అట్టివాడు రచించే వ్యాఖ్యానమును ఆప్త ప్రణీతము అంటారు. వ్యాఖ్యానము ప్రామాణికంగా ఉన్నప్పుడే అది ఆప్త ప్రణీత మవుతుంది. అలా ప్రామాణికంగా ఉండాలి అంటే, అది పంచ లక్షణాయుతంగా ఉండాలి.

పదచ్ఛేదః పదార్థోక్తిః విగ్రహో వాక్య యోజనా।
ఆక్షేపస్య సమాధానం వ్యాఖ్యానం పంచలక్షణమ్।

ప్రామాణిక మైన వ్యాఖ్యానమునకు అయిదు లక్షణాలు ఉండాలి. (1) పదచ్ఛేదము, అంటే పదములను విడగొట్టడము (2) పదార్థోక్తి, అంటే పదముల యొక్క అర్థమును చెప్పడము. (3) విగ్రహము, అంటే సమాసగత పదాలను విడదీసి అర్థము చెప్పడము (4) వాక్యయోజనము, అంటే వాక్యానికి సుస్పష్టంగా అర్థం చెప్పడము (5) ఆక్షేపస్య సమాధానం, అంటే ఆక్షేపానికి సమాధానం చెప్పడము. ఈ అయిదు లక్షణాలు ఉన్నప్పుడే వ్యాఖ్యానము ప్రామాణిక మవుతుంది. అట్టి వ్యాఖ్యానమునే ఆప్త ప్రణీతముగా విజ్ఞులు గ్రహిస్తారు.

ఇక భగవద్గీత విషయానికి వస్తే, మూలగ్రంథము సమస్త వేదార్థ సార సంగ్రహభూత మైనందున, అది దుర్విజ్ఞేయమై కష్టసాధ్యంగా ఉన్నందున వ్యాఖ్యాన యోగ్యమై ఉంది.

శ్రీ శంకరులకు పూర్వులైన వ్యాఖ్యానకర్తలు భగవద్గీతను వ్యాఖ్యానించి ఉన్నప్పటికీ, ఆచార్యులు భాష్యాన్ని అందించారు అంటే, పూర్వ వ్యాఖ్యానాలు పంచ లక్షణాయుతంగా

లేవా? వ్యాఖ్యాన లక్షణాలను విస్మరించాయా? కాదు. వారు కూడా వ్యాఖ్యాన లక్షణాలను అనుసరించే వ్యాఖ్యానించారు. ఈ విషయాన్ని భాష్యంలో శ్రీ శంకరులే అంగీకరించారు. అయినా, ఆచార్యుల వారు భాష్యం వ్రాయవలసి వచ్చింది. కారణ మేమిటో భాష్య పలుకు ల్లోనే విందాం.

తదిదం గీతాశాస్త్రం సమస్త వేదార్థ సార సంగ్రహ భూతం దుర్విజ్ఞేయార్థం। తదర్థా విష్కరణాయ అనేకైః వివృత పద పదార్థ వాక్యార్థ న్యాయ మపి అత్యన్త విరుద్ధ అనేకార్థత్వేన లౌకికైః గృహ్యమానం ఉపలభ్య అహం వివేకతః అర్థ నిర్ధారణార్థం సంక్షేపతః వివరణం కరిష్యామి !

'సమస్త వేదార్థ సార సంగ్రహ భూతమైన గీతాశాస్త్రం యొక్క అర్థాన్ని యథావత్ గ్రహించడం సులభమైన విషయం కాదు; పైగా చాలా కష్టతరం కూడా. అందుచేత, పంచ లక్షణ వ్యాఖ్యాన న్యాయాన్ని అనుసరిస్తూ, పదచ్ఛేదము, పదార్థోక్తి, విగ్రహము, వాక్యార్థము (వాక్య సమన్వయము), ఆక్షేపమునకు సమాధానమును ఇస్తూ కొంత మంది వ్యాఖ్యానించి ఉన్నారు. అయినప్పటికీ, ఆ వ్యాఖ్యానాలు విరుద్ధమైన అనేక అర్థాలతో కూడి ఉన్నందున, అజ్ఞానులు ఆ విరుద్ధమైన అర్థాలను గ్రహించి, గీత లోని భావాలు పరస్పర విరుద్ధంగా ఉన్నాయి అని చెప్పుకుంటూ ఉండటం విని, ఏ విధమైన వైరుధ్యానికి అవకాశం ఇవ్వకుండా విషయాన్ని సుస్పష్టం చేయడానికి సంక్షేపంగా వివరిస్తూ వ్యాఖ్యానిస్తాను' అని ఉపోద్ఘాతం లోనే స్పృశించారు.

స్వాభిప్రాయం

మూల విషయానికి సంబంధించిన అర్థాన్ని సుస్పష్టం చేయడం లోనే వ్యాఖ్యాన ప్రాధాన్యత ఉంటుంది. ఎవరైనా **మార్జారీ** అన్న పదానికి ఆడపిల్లి అనే అర్థాన్ని గ్రహించకుండా, **శునీ** అంటూ ఆడకుక్క అని అర్థం చెప్పా రనుకోండి, ఇక ఆ తరువాత, 'మార్జారీ, అంటే ఆడపిల్లి విశ్వాసం కలది, ఇంటిని కాపలా కాస్తుంది, గొప్ప ఆఘ్రాణ శక్తి కలది' అంటూ అప్రస్తుత అనర్థ వ్యాఖ్యానాన్ని అందించడం జరుగుతుంది.

ఇక్కడే శ్రీ శంకర భాష్యము ఆప్తప్రణీతమై అలరారుతోంది. గీత లోని మూలాన్ని ఎక్కడి కక్కడ పద బంధాలను విడగొట్టి, సంప్రదాయ గాడిలో నిలిచి, అర్థాన్ని సుస్పష్టం చేయడంలో శ్రీ శంకరులు అనితర సాధ్య మైన అసమాన ప్రతిభను ప్రదర్శించారు. బుధులు విభేదించి మరో విధంగా భావించరనే విశ్వాసంతో నా మనస్సు లోని మాట చెబుతున్నా!

భాష్యకారులుగా ఆచార్యుల వారి వైభవాన్ని
తిలకించి పులకించి పరవశించాలంటే,
కడలి కెరటాల వలె ఎగిసి పడే
వాదనల వీణానాద విలసనములతో,
ప్రచండ డిండిమ ధ్వనుల వలె చిందు లేసే
సశాస్త్రీయ సిద్ధాంత భేరీ నినాదాలతో,

అలౌకిక వాగ్విభూతి వినిపించే
నేపథ్య సంగీత ఝురులకు అనుగుణంగా
తర్క వేదికపై గీర్వాణ సుందరాంగి ప్రదర్శించే
ప్రతిభా వైశిష్ట్య నాట్యకళా వైభవాన్ని
అవలోకించా లనుకుంటే,
పున్నమి జాబిల్లి పాలవెల్లిపై వెన్నెల నారబోసినట్లు
ప్రసన్న గంభీరమై శోభించే గీతాభాష్యం కన్నా,
ఆచార్యుల వారి ఉపనిష ద్భాష్యాలను,
ముఖ్యంగా సూత్ర భాష్యాన్ని దర్శించాలి. పఠించాలి.
జ్ఞాన మార్తాండులైన ఆచార్యుల వాగ్వైభవ వేడికి
సంశయ జలనిధులు ఇంకిపోతూ ఉండటాన్ని మనం
కళ్ళారా చూడవచ్చు.
సర్వశాస్త్ర జ్ఞాన వైదుష్యం
అసమాన ప్రతిభా పాండిత్యం - అనే రెండు రెక్కలతో
ఆ పరమహంస వేదాంత గగన వీధులలో
చిత్ర విచిత్రంగా విహరిస్తూ ఉంటే,
దర్శించి తరించే బుద్ధిని చూచి
కళ్ళు కలత చెంది ఈర్ష్య పడతాయి.
హృదయం అమృత జ్ఞాన రస తరంగిత మవుతుంది.



అనుబంధము - అనుగ్రహము

యతః తదర్థే విజ్ఞాతే సమస్త పురుషార్థ సిద్ధిః
ఇత్యతః తద్వివరణే యత్నః క్రియతే మయా!

గీతాశాస్త్ర జ్ఞానము సమస్త పురుషార్థ సిద్ధిప్రదం. ఆ కారణంగా సాగిన ప్రయత్నమే నా ఈ వివరణం - అన్నారు ఆచార్యులు.

సంప్రదాయ ప్రవర్తక ఆచార్య శ్రేష్ఠులైన శ్రీ శంకర భగవత్పాదులు ధర్మద్వయ రూపంతో శోభించే గీతాశాస్త్రం మోక్షమునే ముఖ్య ప్రయోజనంగా కలిగి, వాసుదేవ పరబ్రహ్మమును ప్రధానంగా ప్రతిపాదిస్తూ ఉన్నందున, గీతా శాస్త్రం యొక్క యథార్థ జ్ఞానం కలిగితే సర్వ పురుషార్థములు మానవాళికి సిద్ధిస్తా యనే సత్య సంకల్పంతో గీతకు వ్యాఖ్యానాన్ని అందిస్తున్నట్లు భాష్య ఉపక్రమణిక అంతిమ వాక్యంలో తమ మనస్సు లోని మాటను స్పష్టం చేశారు.

మంగళ దీపాలు

ధారావాహిని-14

స్వామి సుందర చైతన్యానంద

వేదాంత కేసరి

శ్లో॥ తావద్గర్జన్తి శాస్త్రాణి
జంబుకా విపినే యథా ।
న గర్జతి మహాశక్తిః
యా వ ద్వేదాన్త కేసరీ ॥

భావము: అరణ్యము నందు సింహము గర్జించనంత వరకు నక్కలు కూయుచుండును. సింహ గర్జన వినగానే నక్కలు తోకలు ముడుచుకొనును. అలాగుననే వేదాంత సింహము గర్జించనంత వరకు సర్వ శాస్త్రము లనెడి జంబుకములు కూయుచునే ఉండును. వేదాంత కేసరి నోరు విప్పినా ఇక అన్య శాస్త్ర జంబుకములు పలాయన మగును.

వ్యాఖ్య

అరణ్యంలో సింహం మృగరాజు. దానికి అరణ్యంలో పట్టాభిషేకం చేసిందెవరు? దాని పరాక్రమమే దానిని అరణ్యానికి ప్రభువును చేసింది. శాస్త్రారణ్యంలో వేదాంతము సింహము వంటిది. తన లోని సత్యపూర్ణ సిద్ధాంతాలే తనకా స్థానాన్ని ఆపాదించాయి. అరణ్యంలో సింహం లేనపుడు నక్కలు సైతం కూస్తూ ఉంటాయి. నక్కల అరుపులు సింహం గర్జించనంత వరకే ఉంటాయి. అలాగే అన్యమత సిద్ధాంతా లనే జంబుకాలు తాత్త్వికారణ్యంలో శాస్త్ర చర్చలు సాగిస్తూ ఉంటాయి. వేదాంతం నోరు విప్పగానే సర్వ మతాలు మూగబోతాయి.

'వేదాంతము' అనగా వేదము యొక్క అంతమున ఉన్నవి అని అర్థం. అవియే ఉపనిషత్తులు. ఉపనిషత్తులలో నిర్వచింపబడిన విషయమే వేదాంతము. ఇట్టి ప్రాచీన వేదాంత వాఙ్మయాన్ని ప్రసాదించిన ఘనత భారత దేశానికే దక్కింది.

'యావత్ప్రపంచము వెలుగును వాంఛిస్తున్నది. ఎదురు చూస్తున్నది. ఆ వెలుగు భారతదేశము నందే కలదు. అంటే, గారడి విద్యలను ప్రదర్శించుటలో కాదు. కపట వేషములను ధరించుటలో కాదు. శుష్క పాండిత్య ప్రకర్షల యందునూ గాదు. నిజమైన మతము చైతన్యము యొక్క వైభవమును ప్రవచించుట యందే గలదు. ఉన్నత ఆధ్యాత్మిక జ్ఞానమును బోధించుట యందే గలదు. ఈ కారణముగనే భగవానుడు హాని వృద్ధుల మధ్య ఈ జాతిని నేటి వరకు నిలిపి యున్నాడు. ఇప్పుడు సమయ మాసన్న మైనది' అని వేదాంత వైభవాన్ని, అట్టి వేదాంతాన్ని ప్రపంచానికి అందించిన భారతదేశాన్ని స్వామి వివేకానంద కొనియాడి యున్నారు.

యజ్ఞ పోషకులు



శ్రీమతి ఎ.యశోదా శర్మ
హైదరాబాద్, రూ.1,00,000/-
లక్ష రూపాయలు




శ్రీమతి ఎ.భారతి, శ్రీ ఎ.రంగయ్య
హైదరాబాద్, రూ.60,000/-




శ్రీమతి డి.లక్ష్మీ ప్రసన్న
హైదరాబాద్, రూ.50,000/-


మహారాజ పోషకులు
(రూ.10,000/-)




శ్రీ ఎమ్.సుబ్రహ్మణ్యం
హైదరాబాద్
రూ.30,000/-




చి॥ జె.అనంత్
హైదరాబాద్, రూ.30,000/-




డా॥ శ్రీ సి.హెచ్.మోహన్ రావు
సికింద్రాబాద్, రూ.24,000/-



డా॥ శ్రీ సి.హెచ్.బీరప్ప
హైదరాబాద్, రూ.20,000/-



శ్రీ పి.వి.అర్జున్ రెడ్డి
కడప




డా॥ పి.ఆదర్శ్ రెడ్డి
కడప




డా॥ శ్రీమతి పి.భార్గవి రాగూర్
హైదరాబాద్




శ్రీమతి జి.అమృత
హైదరాబాద్



శ్రీ బి.వెంకట రామిరెడ్డి
అనంతపూర్




శ్రీ కె.ప్రభాకర్ రావు
విశాఖపట్టణం



శ్రీ జె.సత్యనారాయణ
ఆదిలాబాద్


రాజపోషకులు
రూ.5,000/-




శ్రీ పి.వీరస్వామి
హైదరాబాద్




శ్రీమతి కె.రోజారాణి
విశాఖపట్టణం



శ్రీ వి.యాదయ్య
హైదరాబాద్



శ్రీ ఎమ్.సంతోష్ కుమార్
హైదరాబాద్



శ్రీ కె.రమేశ్
హైదరాబాద్




శ్రీ టి.చంద్రమోహన్
ఖమ్మం




శ్రీమతి జి.వెంకటరావమ్మ
ఖమ్మం



శ్రీమతి సి.హెచ్.సుజాత
బెంగుళూరు



శ్రీ డి.వి.ఎన్.మల్లికార్జున శర్మ
హైదరాబాద్



శ్రీ ఎస్.నాగప్రసాద్
హైదరాబాద్



శ్రీమతి కె.పద్మావతి
హైదరాబాద్




శ్రీమతి కె.మణికుమారి
గుంటూరు



శ్రీమతి కె.కుసుమ కుమారి
గుంటూరు



శ్రీమతి ఎస్.శాంతామూర్తి
హైదరాబాద్




శ్రీ కె.వెంకటయ్య
హైదరాబాద్



శ్రీ ఎమ్.లింబాద్రి
మెట్‌పల్లి




శ్రీ వై.మల్లికార్జున రావు
గుంటూరు



శ్రీ సి.హెచ్.గౌరయ్య
హైదరాబాద్




శ్రీమతి బి.సాయమ్మ
హైదరాబాద్




శ్రీ జి.భాస్కర్ రావు
హైదరాబాద్



శ్రీమతి ఎ.కుమారి
హైదరాబాద్




శ్రీ పి.దామోదర్ రెడ్డి
సంగారెడ్డి



డా॥ శ్రీ బి.బాపురావు
వరంగల్



శ్రీమతి ఆర్.లలిత
సికింద్రాబాద్




శ్రీ పి.హనుమాండ్లు
హైదరాబాద్

ఓ కథ చెప్పనా!

స్వామి సుందర చైతన్యానంద

అంతా నీ చేతిలోనే ఉంది



ఒక గ్రామంలో సాధువు ఆశ్రమ జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. ఎందరో భక్తులు, ముముక్షువులు సాధు దర్శనం చేసుకొని, ఆయన బోధలను ఆలకించి, తమ బ్రతుకులను తీర్చి దిద్దుకుంటున్నారు.

ఎందరి జీవితాలనో ప్రభావితం చేసిన ఆ సాధు మహాత్ముని కీర్తి నలుదిశల వ్యాపించింది. అది చూచి ఓర్వలేని ఒక వ్యక్తి సాధు నిందకు పూనుకున్నాడు. లేనిపోనివి కల్పించి సాధువు కీర్తి ప్రతిష్టలను దిగజార్చాలని కల్లలన్నీ ప్రచారం చేయసాగాడు.

ఒకనాడు సందర్శకులతో పాటు విమర్శకుడు కూడా ఆశ్రమానికి వచ్చాడు. ఆశ్రమంలో కాలు మోపగనే ఒక చెట్టు క్రింద అప్పుడే పుట్టిన పక్షిపిల్ల అతని కంట బడింది. అంతే. అతని బుర్రలో ఒక ఆలోచన మెరిసింది. వెంటనే కళ్ళు కూడా తెరువలేని స్థితిలో ఉన్న ఆ పక్షిపిల్లను అరచేతిలో ఉంచుకొని సాధువుకు అభిముఖంగా నడచి వచ్చాడు.


'మహాత్మా! ఇదిగో, నా చేతిలో పక్షి పిల్ల ఉంది. అది జీవించి ఉందా? లేక మరణించిందా? మీరు మహాత్ములు కనుక నా ప్రశ్నకు సమాధానం చెప్ప గలరని భావిస్తున్నాను' అని పిడికిలి బిగించాడు.

'నాయనా! అంతా నీ చేతి లోనే ఉంది. అది బ్రతకాలని నువ్వు అనుకుంటే అది బ్రతుకుతుంది. అది చావాలి అనేదే నీ మనోగత మైతే, అది చచ్చి ఉంటుంది' అన్నాడు సాధువు. విమర్శకుడి నోరు మూగ బోయింది. పక్షిపిల్ల చచ్చిపోయింది అని సాధువు అంటే, లేదు లేదు బ్రతికే ఉంది అని ఆ జీవిని కదిలించి చూపాలని, ఒకవేళ అది బ్రతికే ఉందని సాధువు అంటే, పిడికిలి లోనే దానిని నలిపి చంపేసి, అది చనిపోయిందని ఋజువు చేసి, సాధువుకు ఆ మాత్రం జ్ఞానం కూడా లేదని పదిమందిలో నిరూపించాలని భావించాడు శకుని సఖుడు. కథ అడ్డం తిరిగింది. అందరికీ వాడి మాటలు వినిపిస్తే, సాధువుకు వాడి మనస్సు కనిపించింది. అంతా నీ చేతి లోనే ఉంది. చంపి పాపం మూట కట్టుకుంటావో, బ్రతికించి పుణ్యం సంపాదించు కుంటావో అంతా నీ చేతి లోనే ఉంది. నీ చిత్తం లోనే ఉంది అనే భావంతో సాధువు భాషించాడు. అతని మనస్సులో ఏం జరిగిందో ఏమో, సాధువు కాళ్ళ మీద పడి క్షమించమని ప్రార్థించాడు.

సాధువు

స్వామి సుందర చైతన్యానంద

పవిత్రమైన మన హిందూ సంస్కృతిలో సాధువు గోవులాంటివాడు. ఇది అందరి భావన. కానీ వాస్తవానికి సాధువు గోవు లాంటివాడు కాదు, గోవత్సము లాంటివాడు. ఇది నా అభిప్రాయం. అంటే లేగదూడ. తల్లిఆవును వెతుక్కునే లేగదూడ.



సాధువుకు ఇల్లు ఉండదు. అంటే ఇల్లు లేనివాడని కాదు. ఉన్న ఇల్లును వదులుకున్నవాడని అర్థం. సర్వబంధాలను త్రెంచు కున్నవాడని అర్థం. తన బ్రతుకును, తన భావాలను తన వాళ్ళు అనుకునే వారికి ధారపోయడానికి ఇష్టపడనివాడు అని అర్థం. కుండలో ఒక సమయంలో నీళ్ళు ఉండవచ్చు. ఇంకొక సమయంలో మజ్జిగ ఉండవచ్చు. వేరొక సమయంలో బెల్లం ఉండవచ్చు. మరొక సమయంలో సున్నం ఉండవచ్చు. కానీ, కుండకు ఆకాశంతో ఉండేది నిత్య సంబంధం. నీళ్ళతో, మజ్జిగతో, బెల్లంతో, సున్నంతో ఉండేది అనిత్య సంబంధం.

ఇది క్షుణ్ణంగా తెలిసినవాడు సాధువు. తాను ఎక్కడ పుట్టాడో, ఎవరికి పుట్టాడో ఆ సంబంధాలన్నీ కుండకు నీళ్ళతో ఉన్న సంబంధం లాంటివి అని తెలిసి రక్తసంబంధాలకు నీళ్ళు వదిలేసినవాడు సాధువు. ఏదో ఒక క్షణాన మనసును చల్లబరచే స్నేహితులు కుండను చల్లబరచే మజ్జిగలాంటివారే గాని ఎప్పుడూ ఉండేవారు కాదనే సత్యాన్ని బాగా ఎరిగినవాడు సాధువు. తీపిని జీవితంలో అందించే భార్య లేదా భర్తతో ఉండే సంబంధం కూడా బెల్లంతో కుండకు ఉండే సంబంధమే. బెల్లం యొక్క తియ్యదనం కుండకు ఏ మాత్రమో జీవితంలో భార్య లేదా భర్త అందించే తియ్యదనం కూడా అంతేనని బాగా తెలుసుకున్నవాడు సాధువు. కారంతో, అహంకారంతో విర్రవీగే సమాజంతో తనకున్న సంబంధం సున్నంలాగ ఘాటైన అనుభవమేనని బాగా తెలుసుకున్నవాడు సాధువు. కుండ తయారు కాకముందు, తయారైన తరువాత, పగిలిన తరువాత కూడా అది ఉండేది ఆకాశంలోనే. కుండలో ఒకొక్కప్పుడు ఒకొక్క వస్తువు ఉండవచ్చునేమో గాని, ఏది ఉండినా ఏది లేకపోయినా ఎప్పుడూ ఉండేది ఆకాశమేనని, ఈ నిత్య సంబంధాన్ని క్షుణ్ణంగా

గుర్తించినవాడు సాధువు కనుక అనిత్య సంబంధాల్ని మనసులోనుంచి అతి తేలికగా నెట్టేయగలడు. అందుకే సాధుదర్శనం పుణ్యం అంటాము మన సంస్కృతిలో.

కానీ, ఇన్నిటిని త్యజించిన సాధువు దేహాన్ని, ఆకలిని (అవి అనిత్యమే అయినా) త్యజించలేడు. పక్షికి ఎలాగైతే తలదాచుకునేందుకు గూడు అవసరమో శీతోష్ణాల నుండి తనను తాను కాపాడుకొనేందుకు సాధువుకు కూడా ఇల్లు అవసరం. అన్నిటిని, అందరిని వదులుకున్నవాడు కనుక, ఆకలి వేస్తే ఎవరైనా అంత కబళం పెడితే వాళ్ళు తిడుతూ పెట్టినా, పెట్టి తిట్టినా, లేక తిట్లే పెట్టినా వాటిని అట్లులాగా, పెసరట్లు లాగా ప్రియంగా స్వీకరించేందుకు వెనుకాడనివాడు సాధువు. అందరినీ త్యజించి వచ్చిన తనకు పట్టెడన్నం పెట్టే సమాజంతో తనకు మిగిలి ఉండేది మంచితనం, మిత్రత్వం. ఒకవేళ సమాజం తనకు అన్నం పెట్టకపోయినా సాధువు చేయగలిగింది ఏమీ లేదు. పట్టెడన్నం పెట్టి తలదాచుకునేందుకు గూడు నిచ్చి, ఆ మాత్రం తనను కాపాడిన సమాజానికి తిరిగి మేలు చేయకుండా సాధువు ఉండలేడు. అందరిని వదిలిన సాధువుకి ఇక్కడ సమాజంతో ఒక సంబంధం ఏర్పడిపోయింది. మరి ఈ సమాజ ఋణం తీరేదెట్లా? ఋణం తీరకుంటే జన్మ తప్పదు. తనకు అన్నం పెట్టి పోషించిన సమాజ ఋణాన్ని, జ్ఞానాన్ని ప్రశాంతతను ప్రసాదించిన ఋషి ఋణాన్ని తీర్చుకోవాలి అని భావించిన సాధువు యొక్క జీవితం ఇక్కడే ఒక అందమైన మలుపు తిరుగుతుంది.

ఒక స్వచ్ఛమైన, నిర్మలమైన, పుణ్య నదీ ప్రవాహం పిల్లకాలువల్ని నిరసించలేదు. బురద నీటిని నిరాకరించలేదు. ఫ్యాక్టరీ కాలుష్యాన్ని కాదనలేదు. బట్టలు ఉతికే వారిని వారించలేదు. మలమూత్రాలు విసర్జిస్తూ స్నానాలు చేసేవారిని 'నేను పానయోగ్యమైన పుణ్య తీర్థాన్ని' అని నివారించలేదు. కలిసేవాటిని కలుపుకుంటూ, ఇష్టాయిష్టాల్ని ప్రక్కకి నెట్టి, ధర్మాధర్మాల బాటలో ప్రవహించేదే జీవనది. సాధువు నిర్మలమైన ఒక పుణ్యానది లాంటివాడు. తృప్తితో పొంగేటటు వంటి ఆంతరంగిక ఆనందం ఒకవైపు, అలా పొంగే హృదయాన్ని కృంగదీసే బాహ్య పరిస్థితులు మరొకవైపు, వీటి మధ్య మంచి చెడులను కలుపుకుంటూ నది ఎలాగైతే సాగిపోతూ ఉంటుందో అలా నడక సాగించేవాడు సాధువు. కడలిని చేరేంత వరకు నది కదిలిపోతూనే ఉంటుంది. తన గమ్యమైన మోక్షపదాన్ని చేరేంతవరకు సాధువు నడక సాగిస్తూనే ఉంటాడు . ఎవరికి ఏమిచ్చాడో భగవంతుడు తెలియదుగాని, ఎవరినీ నిరసించలేనటువంటి అశక్తతను మాత్రం సాధువుకు భగవంతుడే ఇచ్చాడు. అది అదృష్టమో దురదృష్టమో, వరమో, శాపమో ఊహకు అందదు కానీ భగవంతుడు ఇచ్చాడు కనుక అది ప్రసాదమే. ఎక్కడైనా సాధువు ఏ బాధలకైనా గురి అయితే దానికి ఇదే కారణమై ఉంటుంది అనేది నా వ్యక్తిగతమైన అభిప్రాయం. సాధు జీవితంలో కష్టాలు ఎప్పుడూ ఉండవు, కొనితెచ్చుకుంటే తప్ప. బాధలు కొనితెచ్చు కోవడమనేది సాధువుకు ప్రత్యేకంగా భగవంతుడే ప్రసాదించిన హృదయ సౌందర్యమేమో!

మహిష్మతిలో శంకరయతి

ధారావాహిని-1

స్వామి సుందర చైతన్యానంద

ప్రస్తావన

అంతరించేందుకు ఆరంభమయ్యే చదరంగాలన్నీ ఒకనాటికి వేదనాంతములే.
వేదనాంతముల రూపు మాపేందుకు అరుదెంచినదే వేదాంత శాస్త్రము.
ఈ ప్రపంచంలో
నడిపే వెలుగొక టుంది.
కదిపే శక్తొక టుంది.



అదే నీవు. అదే నేను. అదే మనిద్దరిలో భాసించే 'తాను'.
'నేను' ఏనాడైనా అనిత్యమే. 'తాను' ఎప్పుడూ నిత్యమే.
ఇంద్రియ జలాలు ఇంకిపోతే
ఆశల అలలు ఆవిరైపోతే
కాలిపోతున్న 'నేను' అనే పుడమిపై 'తాను' అనే మేఘం వర్షిస్తే
'తాను' అనే సూర్యుని 'నేను' అనే గ్రహణం విడిచి దూరమైతే
మానవరూపాలలో దేవతలు కదుల్తారు
మనుష్యుల మస్తిష్కాలలో మహర్షులు చరిస్తారు.
ఇక్కడే పనులన్నీ పూజ లవుతాయి
నీళ్ళన్నీ తీర్థాలవుతాయి.
ఆశా గర్భవతి ఏనాడైనా శోకశిశువునే ప్రసవిస్తుంది.
ఆశ . . . . ఆశ . . . . ఆశ . . . .
ఏదో పొందాలని - ఆశ
ఏదో పోగొట్టుకోవాలని - ఆశ
ఆశా విహంగము కర్మ రెక్కల నాడిస్తూ తిరిగి తిరిగి అలసి పోవలసిందే.
వచ్చేందుకు లేని దేముంది?
పోయేందుకు ప్రత్యేకంగా ఏముంది?
ప్రశ్నలన్నీ విద్యవే. పరితాపాలన్నీ అవిద్యవే.
ఈ వైరుధ్యమే శాస్త్రార్థానికీ దారి తీస్తుంది. అదియే విద్యావిద్యల మధ్య అగాధము. అదియే జ్ఞానకర్మల మధ్య వివాదము. శ్రీశంకర మండనమిశ్రుల మధ్య సాగిన శాస్త్రార్థ వివాదము. పోదాం పదండి. వివాదం లోకి కాదు. విచారం లోకి. వాదం నుండి నాదం లోకి.

ఆదిశంకరుల అసమాన ప్రతిభ

శ్రీమత్పరమహంస పరివ్రాజకాచార్యవర్య శ్రీశ్రీశ్రీ శంకర భగవత్పాదులు భారత వర్షమున జాజ్వల్యమానంగా శోభించిన భగవద్విభూతి. వారు జన్మించి వేయి సంవత్సరాలు మించినా వారి కీర్తి నేటికిని వేనోళ్ళ కొనియాడబడుతూనే ఉంది. దేశము అవైదిక పంకమున మగ్నమైనపుడు శ్రీ ఆచార్యులు అవతరించి జాతి యావత్తును ఉద్ధరించుటయే గాక జగతికి జ్ఞానజ్యోతిని ప్రసాదించి రక్షించారు.

బదరికాశ్రమానికి సమీపాన వ్యాసతీర్థ ముంది. వ్యాస మహర్షి ఆశ్రమము అక్కడే ఉంది. వ్యాస భగవానుడు మహాభారతమును రచించినది కూడ అక్కడే. ఈ ఆశ్రమము ఒక గుహలో ఉంది. ఆ గుహకు బయట కుడి వైపున సరస్వతీ ఆలయ ముంది. ఎడమ వైపు గణపతి గుడి ఉంది. వ్యాసుడు మహాభారతమును చెప్పినపుడు గణపతి ఆ ప్రదేశమున ఉండి రచించే వాడు. అందుచేత దానిని గణపతి ఆలయము అంటారు. గణేశుడు ఆయా సంఘటనలను, విషయములను అవగతము చేసుకొని రచిస్తున్నాడా లేదా? అని నిర్ణయించుటకు సాక్షిగా సరస్వతీదేవి అక్కడే ఉండెడి దట. కనుకనే దానిని సరస్వతీ మందిరము అంటారు. వ్యాస భగవానుడు మహాభారతమును రచించిన ఈ గుహ యందే శ్రీశంకరాచార్య స్వామి శిష్యులతో కలసి వసించారు. ప్రస్థానత్రయమునకు ఆచార్యులు భాష్యమును రచించినది ఇక్కడే. తమ పండ్రెండవ సంవత్సరమున ఈ ప్రదేశమునకు వచ్చిన ఆచార్యులు నాలుగు సంవత్సరములు ఇక్కడే ఉండి భాష్య రచన పూర్తి చేశారు.

భాష్య రచన ముగిసిన తరువాత శిష్యులతో కలిసి ఆచార్యులు హిమాలయముల లోని అనేక తీర్థ రాజములను సందర్శించారు. చివరగ కేదారనాథానికి చేరారు. బదరీనాథము కంటెను కేదారనాథమున శీతలము అధికము. జనసంచారము శూన్యము. ఈ క్షేత్రమునకు కేదారేశ్వరుడు అధిష్ఠాన దేవత. కేదారనాథ పర్వతము తరువాత స్వర్గారోహణ పర్వతముంది. పాండవులు ఇక్కడ నుండియే స్వర్గారోహణము చేసినట్లు ప్రతీతి.

శిష్యులతో కూడి శ్రీశంకరాచార్య స్వామి ఈ ప్రదేశమున వసించారు. భయంకరమైన చలిని భరించలేక శిష్యులు తల్లడిల్లి పోయారు. అది చూచి ఆచార్యులు యోగదృష్టిచే వేడినీరు స్రవించు స్థానమును కనుగొన్నారు. ఈ తప్తకుండమును జూచి శిష్యులు తృప్తి చెందారు. శ్రీ శంకరులు అచ్చట నుండి గంగోత్రికి బయలుదేరారు. ఉత్తర కాశిలో నున్నపుడు ఆచార్యులు వ్యాకులు రైనట్లు చెబుతారు. పదహారవ యేట శ్రీవారికి మృత్యుయోగ ముండుటయే ఈ వ్యాకులతకు కారణంగా భావిస్తారు. కానీ ఒక అద్భుత సన్నివేశము కారణంగా మృత్యుయోగము అమృత యోగముగా మారిపోతుంది.

బాదరాయణ దర్శనము

ఉత్తరకాశిలో శ్రీ శంకరులు తమ శిష్యులకు బ్రహ్మసూత్ర భాష్యమును బోధిస్తున్న

రోజులవి. ఒకనాడు ఆచార్యులు బోధిస్తూ ఉండగా నల్లని దేహము కలిగిన ఒక విప్రుడు అక్కడికి వచ్చి, 'ఎవరు నీవు? ఏమి బోధిస్తున్నావు?' అని ప్రశ్నించాడు.

'వీరు మా గురుదేవులు. సర్వ ఉపనిషత్తుల సారమును గ్రహించిన వారు. ద్వైతమును నిరాకరిస్తూ, బ్రహ్మసూత్రములకు అద్వైతపరంగా భాష్యమును రచించారు' అని శిష్యులు బదులు పలికారు. 'ఆహా! ఏమి? ఈ కలియుగమున బాదరాయణ వ్యాసుడు రచించిన బ్రహ్మసూత్రముల రహస్యమును తెలుసుకొన్న వాడు ఉన్నాడా? అదే నిజమైతే, ఈ సూత్రములలో ఒక విషయమున నాకు కలిగిన సంశయాన్ని నివారించి, నాకు సంతుష్టిని కలిగించటం మీ గురువు గారి కర్తవ్యమై ఉంది' అన్నాడు ఆ బ్రాహ్మణుడు.

'బ్రహ్మసూత్రార్థములను గ్రహించిన విద్వద్వరేణ్యులకు నేను నమస్కరించు చున్నాను. నేను సూత్రార్థములను పూర్ణంగా గ్రహించ గలిగితి నని అభిమాన పడుట లేదు. అయిననూ మీరు అడుగ వచ్చు. నా బుద్ధికి తోచినంతలో మీకు చెప్ప గలను' అని వినమ్రులై పలికారు శ్రీ శంకరులు. బ్రహ్మసూత్రముల లోని మూడవ అధ్యాయము నందలి ప్రథమ పాదము లోని ప్రథమ సూత్రమునకు వ్యాఖ్యానమును అడిగాడు ఆ బ్రాహ్మణుడు. శంకరులు వివరణమును స్పష్టము గావించారు. దానిపై మరికొన్ని సందేహములను ఆ బ్రాహ్మణుడు లేవదీసే వాడు. ఆచార్యులు వాటిని నిర్ద్వంద్వంగా ఖండించే వారు. ఈ అరుదైన అద్భుత శాస్త్రార్థమును చూచి శిష్యులు ఆశ్చర్యచకితు లయ్యారు. ప్రశ్నించే ఈ బ్రాహ్మణుడు సామాన్యుడు కాడని పద్మపాదునికి సందేహము కలిగింది. వ్యాస భగవానుడే బ్రాహ్మణుని రూపంలో వచ్చినట్లు అనుమానం కలిగింది.

మరునాడు ఆచార్యుల ప్రార్థన నాలకించి వ్యాస భగవానుడు తమ భవ్య రూపాన్ని చూపారు. ఆచార్యుల భాష్య రచనను తిలకించి పులకించారు. పరవశించిన పవిత్ర హృదయంతో ఆశీర్వదించారు. శ్రీ శంకరుల మృత్యుయోగమును తొలగించారు. మరో పదహారు సంవత్సరముల ఆయుర్దాయమును ప్రసాదించారు. అద్వైత సిద్ధాంతమునకు విశేష ప్రచారమును గావించుటకు సుప్రసిద్ధ పండితుడైన కుమారిల భట్టును తమ మతము లోకి తీసికొన వలసినదిగా చెప్పి వ్యాసుడు అంతర్ధాన మయ్యాడు.

కుమారిలభట్టు ప్రయాగలో త్రివేణీ తీరమున ఉన్నాడని ఆచార్యులకు తెలిసింది. శిష్యులతో గూడి బయలుదేరిన శ్రీ శంకరులు ప్రయాగ చేరి త్రివేణిలో స్నానం చేశారు. సుగంధభరిత పవనాలు చల్లగా వీస్తున్నాయి. త్రివేణీ తీరమున ఆచార్యులు ఆసీను లయ్యారు. ఇంతలో వారికి కుమారిల భట్టును గూర్చిన వార్త తెలిసింది. వేద విశిష్టతను పునః ప్రకాశింప చేసినవాడు, యజ్ఞయాగాది కర్మలను పునరుద్ధరించిన వాడు అయిన కుమారిలుడు తన పాప ప్రక్షాళనము కొరకు అగ్నిలో ప్రవేశించు చున్నాడు అని తెలిసింది. వెంటనే కుమారిల డున్న ప్రదేశానికి బయలుదేరి వెళ్ళారు శ్రీ శంకరులు.

(సశేషం)

స్పందన

శ్రీ ఎస్.వాసుదేవరావు, ఐ.పి.ఎస్.,
డి.ఐ.జి. ఆఫ్ పోలీస్.

పూజ్యులు, ఆచార్యుల వారికి

నమస్కారములు.

నా జీవితానికి మీరే గొప్ప ప్రేరణ. పరమేశ్వరుని జ్ఞానము మీ ద్వారా స్పష్టంగా, సమగ్రంగా మానవాళికి అందుతూ ఉంది. దానికి మేమందరము ఎల్లవేళలా మీకు కృతజ్ఞులము.

శ్రీవారి ఆధ్యాత్మిక సంపద మాకందరికీ అనేకములైన గ్రంథములు, ఆడియోలు, వీడియోలు, 'గిరిధారి' మాసపత్రిక - రకరకాలుగా అందింపబడుతూ ఉంటాయి. ఇది ఒక 'నాగరికత' స్థాయిని మించిన వారసత్వం. మహాభారతము విడుదల అయిన తరువాత మాకు మీ ద్వారా భాగవత, రామాయణ, మహాభారతము లనే రత్నత్రయము లభించడము జరిగింది.

ఆధ్యాత్మిక శిఖరాలలో హిమాలయాలను మించిన వారిలో ప్రముఖులైన మీ బోధలను వెనువెంటనే అందుకొనే భాగ్యం కలిగిన కోట్ల మంది జిజ్ఞాసువులలో నేను ఒకణ్ణి అయినందుకు ఆనందిస్తూ, మీకు శతకోటి నమస్కారాలు వినమ్రంగా సమర్పించు కుంటున్నాను.

త్వరలో శ్రీవారి దర్శనం చేసుకుంటాను. దానికి మీ అనుగ్రహం కావాలి.

భవదీయుడు

వాసుదేవరావు

పూజ్య గురుదేవులు శ్రీశ్రీశ్రీ స్వామి సుందర చైతన్యానందుల వారి పాదపద్మములకు శిరమోడ్చి భక్తి పూర్వక నమస్కారములు.

నేను 1992 నుండి చిత్తూరు, కడప పట్టణాలలో జరిగిన జ్ఞానయజ్ఞాలలో శ్రోతనై, స్వామీజీ ప్రవచనాలకు ముగ్ధుడనై, వారు రచించిన దాదాపు అన్ని గ్రంథములను తెప్పించుకొని చదివి, వాటిని మరి కొందరి చేత చదివించు చున్నాను. గత పద్దెనిమిది సంవత్సరాలుగా 'గిరిధారి' పత్రికను చదువుతూ, ప్రవచనాల సి.డి.లను తెప్పించుకొని, వాటిని ఇతరులు కూడా చూచే భాగ్యాన్ని కల్పిస్తూ, జీవితాన్ని కొనసాగిస్తున్న స్వామీజీ అజ్ఞాత భక్తుడను.


స్వామీజీ బోధలు నగరాలు, పట్టణాలే కాకుండా పల్లెసీమలలో కూడా లక్షలాది మంది ప్రజలలో ఆధ్యాత్మిక స్పృహను వంట పట్టించాయి. ఇది అక్షర సత్యం. మన పూర్వ పుణ్య ఫలంగా లభించిన మన ఆచార్యదేవులు అపర ఆదిశంకరాచార్యులే. పూజ్య స్వామీజీ నిర్వహించే జ్ఞానయజ్ఞంలో పాలు పంచుకోవాలని చంద్రునికి ఒక నూలుపోగులా, మా దంపతులము రాజపోషకుల పంచన చేరుతూ, డ్రాఫ్టును స్వీకరించ వలసినదిగా ప్రణమిల్లి ప్రార్థిస్తున్నాము.

శ్రీమతి కె.రామమ్మ
శ్రీ కె.మునికృష్ణా రెడ్డి
పుత్తూరు

(37వ పేజీ చూడుము)

నిర్గుణ ధ్యాన యోగం

స్వామి సుందర చైతన్యానంద



'ఉన్నది నీవే అని తెలుసుకోవడం జ్ఞానం. నీవు నీవుగా ఉండేందుకు చేసే ప్రయత్నం ధ్యానం. మనసుతో మనం కలిసి నడిస్తే అది వ్యవహారం. మనతో మనసు కలిసి ఉండటం ధ్యానం. మనం నడచినా, కూర్చున్నా, కర్మలాచరించినా, ఆచరించకపోయినా మనసు మనతో కలిసి ఉండటం, ఏ వ్యాపారాలు లేకుండా మనసు ఉండటమే ధ్యానంలో ప్రధానమైన విషయం. అందుకే **ధ్యానం నిర్విషయం మనః** అన్నారు.

అయితే, మనసులో ఏ వృత్తులూ కదలకుండా ఉండటం సాధ్యమా? ధ్యానం మానసవ్యాపారమే కనుక ధ్యానం కూడా కర్మే. కర్మలో స్వేచ్ఛ ఉన్నట్లే, ధ్యానంలోనూ మనసుకు స్వేచ్ఛ ఉంది. ఆలోచించే స్వేచ్ఛ, ఆలోచనలను ఆపి ధ్యానం చేసే స్వేచ్ఛ మనసుకు ఉన్నాయి. ఇంతకీ ధ్యానం చేసే 'నేను' ఎవరు? సత్యాత్మా? లేక మిథ్యాత్మా? సత్యాత్మ లేక స్వరూపానికి ధ్యానం యొక్క అవసరం లేదు కనుక ధ్యాత మిథ్యాత్మ అనేది సత్యం.

ఇంతవరకు **(సగుణ బ్రహ్మ విషయ మానస వ్యాపారః)** 'కర్త'గా సగుణధ్యానం చేశాము. ఇప్పుడు కర్త మీదనే ధ్యానం చేస్తూ ఉన్నాము. దీనిని నిర్గుణధ్యానంగా వాడుకలో పిలుచుకున్నా వేదాంత పరిభాషలో దీనిని 'నిదిధ్యాసనం' అని అంటారు.

ధ్యాత అధ్యాసలో ఉన్నవాడు. ఏ కర్మైనా అధ్యాసలోనే జరుగుతూ ఉంది. కనుక ధ్యానం కూడా అధ్యాసలోనే జరుగుతూ ఉంది. ఎన్నో జన్మలు గడిచాయి. అన్ని జన్మల లోనూ ఎక్కువగా చెడు ఆలోచనలే నడిచాయి. వీటి మధ్య ఆచరించిన కర్మలు ఎన్నో! ఈ కర్మల యొక్క ఫలితాలు ఎన్నో! ఇవి పర్వతాల రూపంలో పాపాలై పడి ఉన్నాయి. ప్రవాహరూపంలో దోషాలై ప్రవహిస్తూ ఉన్నాయి. ఇన్ని జన్మల్లో ఇన్ని విధాలుగా నలిగిపోయిన ఒక వ్యక్తి ఈరోజు ధ్యానానికై కూర్చున్నాడు. ఇది ధ్యాత యొక్క పరిస్థితి. ఈ ధ్యాతకు అనేకమైన గాయాలు ఉన్నాయి. విపరీతమైన ఆలోచనలు ఉన్నాయి. అంతర్యం భయాలతో, ద్వేషాలతో నిండి ఉంది. ధ్యాత యొక్క నేపథ్యాన్ని వదలి మనం ముందుకు పోలేము. ఇదంతా అతని దురదృష్టం. కానీ ఇంత దురదృష్టంలోనూ ఒక అదృష్టం ఉంది. అదే నేను ధ్యానం చేయాలి అనే సంకల్పం. మహాత్ముల ద్వారా విన్న ఆప్తవాక్యాల వల్లనో, లేక ఏ కొద్దిపాటి పుణ్యం మిగిలి ఉండటం వల్లనో ధ్యానం చేయాలి అనే సత్సంకల్పం అతనికి ఈరోజు కలిగింది.

ఏ మనసైతే చేయగూడని ఆలోచనలు చేస్తూ, లేనివాటిని చూపిస్తూ వచ్చిందో, ఏ మనసైతే చేయవలసిన ఆలోచనలు చేయకుండా ముందుకుపోయే మార్గాన్ని వెనుకకు మళ్ళిస్తూ వచ్చిందో, ఆ మనసే నేడు ధ్యానం చెయ్యాలి. అన్నిచోట్ల ఆటంకాలను కలిగించిన మనసు, అవరోధాలను సృష్టించిన మనసు, విఘ్నాలను కల్పించిన మనసు, బ్రతుకును చిందరవందరగా తయారుచేసిన మనసే ఈ ధ్యానంలోనూ ఉంది కనుక చిన్నపిల్లవాడిని ఏవిధంగా లాలించి, పాలిస్తామో ఆవిధంగానే మనసులో గూడుకట్టుకొని ఉన్న భయాలను, సంశయా లను తొలగించి మనసుకు ధైర్యాన్ని, ఉత్సాహాన్ని కల్పించాలి.

మనసున్నందుకు ఆలోచనలు వస్తాయి. మనసులో వృత్తులు ఉంటాయి కనుకనే ధ్యానం చేస్తున్నాము. ఇదంవృత్తులు విపరీతంగా వస్తూ ఉంటే వాటినుండి విడిపడి అహంవృత్తిని చూడటం; ఇదంవృత్తులు అదృశ్యమై అహంవృత్తి మాత్రమే మిగిలినపుడు అహంవృత్తిని అహంస్వరూపంగా భావించడమే నిర్గుణధ్యానంలోని కేంద్రవిషయం.

ఏ అల కూడా సముద్రం కన్నా దూరంగా లేదు. ఏ వృత్తీ చైతన్యం కన్నా వేరుగా లేదు. అల సముద్రాన్ని పరిమితం చేయలేదు, మార్పుచేయలేదు. అదేవిధంగా మన మీద ఆధారపడి ఉన్న వృత్తి మన స్వరూపాన్ని పరిమితం చేయడంగాని, మార్పు చేయడం గాని చేయలేదు. ఇక దేనికి అలజడి?

వృత్తి ఉంది - చైతన్యం ఉంది; వృత్తి లేదు - చైతన్యం ఉంది. గాఢనిద్రలో ఈ వృత్తిరహిత స్థితి మన అందరి అనుభవంలోనూ ఉంది. అలలు సముద్రానికి అలంకారం. అలలు లేని నిస్తరంగ జలధి కూడా ఒక అందం. మనసులో వృత్తులు ఉంటే ఉండనీ. వాటి ప్రభావం మన మీద లేకపోతే చాలు. ఆటంకాలు రావడం, వాటిని తొలగించే ప్రయత్నం చేయడం ధ్యానంలో ముఖ్యవిషయం కాదు. ఆత్మ ఎప్పుడూ అసంగమే అనే భావనలో ఉండటమే ధ్యానం.

ఆత్మ ఏ వృత్తి నుండి కూడా విడిపడి ఉండే అవకాశం లేదు. కలిసి ఉంటే నష్టం లేదు. వచ్చిపోయే వృత్తుల్ని నేను చూస్తున్నాను. 'నేను' అనే మహాసాగరంలో, చైతన్య సాగరంలో, వృత్తులు అనే అలలు అలాఅలా కదలిపోతూ ఉన్నాయి. వాటివల్ల భయము గాని, రాగము గాని, ద్వేషముగాని కలగకుండా నిస్సంగుడిగా ఎవడైతే ఉండగలడో అతడే ధ్యానయోగి. ఏదో ఏదో ఊహించుకొనేవాడు ధ్యానయోగి కాలేడు. ఏ పరిస్థితులలోనూ దుఃఖం దరిచేరనివాడే నిర్గుణధ్యానయోగి.

ఆత్మన్యే వాత్మనా తుష్టః ఆత్మ యందు ఆత్మచేత సంతృప్తిని పొందువాడు ధ్యానయోగి. అతని ఆనందాన్ని భగ్నం చేయగల శక్తి ఈ ప్రపంచంలో దేనికీ లేదు. ఇదే నిర్గుణధ్యానయోగి యొక్క అభయస్థితి, అఖండానందస్థితి.


అసంగోఽహం అసంగోఽహం అసంగోఽహం పునః పునః
సచ్చిదానంద రూపోఽహం అహమేవాహ మవ్యయః

గోపీ ప్రేమ

స్వామి సుందర చైతన్యానంద

పాటరాని వాడు

ఏడుపు తెలియని వాడు - ఈ ప్రపంచంలో ఉండడని ప్రతీతి.



స్పందనతో కదిలేది రాగసాధన

రోదనలో మిగిలేది జీవి వేదన.

పుట్టుకలో దుఃఖమూ ఉంది, సుఖమూ ఉంది. పుట్టగానే బిడ్డ ఏడ్వటం జరుగుతుంది. ఆ ఏడుపును విని అందరూ ఆనందించటమూ జరుగుతుంది.

బిడ్డ కేకలో

ప్రసవంలోని ప్రమాద భరిత బాధా ఉంది.

విముక్తి లోని ప్రమోదయుత సుఖమూ ఉంది.

కనుకనే,

రాగంలో రోదన, రోదనలో రాగం మేళవింపబడిన మానవ జన్మను కడతేర్చే సాధనలు కూడా రాగ రోదనలే. అవే వేదనా భరిత నివేదనలు. విరహ వేదనలు.

బాధల గీతాలు

బోధల గీతాలు

భక్తుల తాపాలు

పరితాపాలను తొలగించే ప్రకృతి మాత చనుబాలు.

భాగవత మంతా ప్రేమ పాలే.

ప్రేమకు ఒక ప్రత్యేకమైన భాషలేదు.

ప్రేమ అందుకనే చల్లగా ఉంటుంది. ఒకొక్కసారి వేడిగా మారుతుంది. మరొక్కసారి ఆ వేడితో వడి తోడవుతుంది. సవ్వడి చేస్తుంది. ప్రపంచాన్ని కట్టడి చేస్తుంది. ముందు వెనుకలు చూడకుండా ముట్టడి చేస్తుంది. మాట కొట్టొచ్చినట్టున్నా, అట్టడుగున ప్రేమ జున్నే ఉంటుంది. అదే ప్రేమ. గోపీ ప్రేమ. ఆ ప్రేమే విరహమై విలపిస్తే గీతం అవుతుంది. ఈ గీతాలే భాగవతంలో గోపికల విరహ గీతాలు.

భాగవతంలో ప్రధానంగా రెండు విరహ గీతాలున్నాయి. ఒకటి గోపికా గీతం. రెండవది

భ్రమర గీతలు.

అది బృందావనం.

ప్రేమవనం.

అక్కడ ప్రేమే జీవనం.

ప్రేమకు కూడా భాష ఉంది. ఆ భాషకు శబ్దం లేదు. కాని ప్రేమ శబ్దం చేస్తుంది. గుండెలో చప్పుడు చేస్తుంది. గుండె శబ్దము అదేనేమో!

భావ జగత్తులో ప్రేమ ఆరని దీపం.

దాన్ని అందరూ చూడలేరు. ప్రేమ భావాలు అందరికీ అంత తేలిగ్గా పట్టవు.

భావాన్ని గ్రహించేందుకు హృదయమే నిఘంటువు.

ప్రేమ లేకుండా పెడితే మనసు కుంచుకు పోతుంది.

ప్రేమతో కొడితే హృదయం తేలిక పడుతుంది.

గౌరవాన్ని ప్రకటించటానికి 'తమరు' అనాలి.

ప్రేమను చూపేందుకు 'నీవు' అంటే సరిపోతుంది. సిరి గల ప్రేమ అలా సరిపెట్టు కుంటుంది.

శుష్క పాండిత్యాలకు శూన్య హృదయాలకు ప్రేమ జీర్ణం కాదు.

ఆహారము లేకపోతే కొంతకాలం బ్రతకవచ్చు.

నీరు లేకపోతే ఎంతో కొంతకాలం జీవితాన్ని సాగించవచ్చు.

ప్రాణం లేకపోతే క్షణం కూడా మనుగడ కొనసాగదు.

కాని, ప్రాణం కన్నా ప్రేమ గొప్పది. అందుకే ప్రాణం కన్నా ప్రేమనే ఎక్కువగా గోపికలు ప్రేమించారు. తమ ప్రాణాల్ని సైతం ప్రాణనాథుడైన గోపాలుని కొరకు చలింప చేశారు.

అయిదు వేళ్ళు ఒకే రీతిగా లేవు, కాని ఒకే చేతిలో ఇమిడి ఉన్నాయి.

ఒకే పనిని చేస్తున్నాయి.

గోపికలూ అంతే.

వారిది ఒకే భావం.

ఒకే హృదయం.


ఒకే బాట. ఒకే పాట.

అందుకే, గోపికలందరు కలిసి పాడిన పాటలు గీతాలు కాకుండా 'గీతం' అని ఏకవచనంగా కీర్తింపబడ్డాయి. అదే గోపికా గీతం.

భాగవత సాగరంలో లభించిన అమృతభాండం.

రాస పంచాధ్యాయిలో ప్రాప్తించిన అమర నాదం.

గోపికల మధ్య శ్రీకృష్ణుడు అంతర్హితుడు కాగానే కృష్ణగతచిత్తులైన గోపికలు విరహవేదనను భరించలేక విలపించారు. ప్రేమతో గీతాలు ఆలపించారు. అవే 'గోపికాగీతం'గా, భక్తుల పాలిట కల్పవృక్షంగా కీర్తింపబడ్డాయి.



ఇక్కడ గోపికల గొంతులు అనేకము.

కాని, గానం ఒక్కటే.

భావ మొక్కటే.


బాధా ఒక్కటే.

పదాలు వేరు. పదార్థ మొక్కటే.

వివరణలు వేరు. విషయ మొక్కటే.

అందరి గుండెలు ఒకేలా కొట్టుకుంటాయి.

తాళ స్వర సమ్మేళనంలో అనేక వాద్యాలు ఒకే లయతో ధ్వనించునట్లు, గోపికల హృదయాలు ఒకే ప్రేమతో పలవరిస్తాయి. పలకరిస్తాయి. పరవశిస్తాయి.



మిఠాయి లన్నిటిలో తీపొక్కటే ప్రధానము.

గోపిక లందరిలో కృష్ణుడొక్కడే ప్రాముఖ్యము.

గోపికలకు ఉపదేశాలు తెలియవు.

సందేశాలు అర్థం కావు.

కర్తవ్యాలు కనిపించవు.

సాధనలు వినిపించవు.

వారి ప్రేమలో నియమాలు నిలవవు. సమయాలు తెలియవు.

మనస్సు మూగబోగా బ్రతుకు పిచ్చిదై పోతుంది.

కనుకనే, భాగవతంలో శుకబ్రహ్మ

'కృష్ణాన్వేషణ కాతరాః - తదాత్మికాః - గోప్యః ఉన్మత్తవచః'

కృష్ణుని కొరకు వెదికి, వెదికి వేసారి దిగులు చెందిన గోపికలు కృష్ణగత చిత్తులై పిచ్చి మాటలు పలికారు అన్నాడు.

అవును. అవి పిచ్చి మాటలు.

ప్రేమ పిచ్చి మాటలు. పిచ్చి పాటలు. ప్రేమపిచ్చి పాటలు.

మధురలో గోపాలుడు
రేపల్లెలో గోపెమ్మలు - మధ్యలో
తగుదునమ్మా అంటూ ఉద్ధవుడు.

కాంతల కమనీయ చెక్కిళ్ళు
నిండినవి కడగళ్ళ వడగళ్ళు

ఉన్ననాడు తెలియదు ఉన్నదెవరో
లేనినాడే తెలియు లేని దెవరో!

ఉన్న వెందుకు ఉన్నది లేనినాడు
లేని దానిని తెలుపుతూ ఉండునేమో!

బాధలు బోధలను ప్రసవించుచుండగా
విద్య లెందుకు వనితలకు వింతగాని

వలచి విలపించువారలె వసుధలోన
నయన జలములె నిజమైన సుధలు గాన

అసమానులు తరచు అహంకారులె గాన
సర్వ సామాన్యమై ప్రేమ పరిఢవిల్లె

కలతను రానీక మమతను పోనీక
హృది గడపపై కాపుర ముండు ప్రేమ

చెవిటిది ప్రేమ మరొకటి వినలేదు
గ్రుడ్డిది ప్రేమ వేరొకటి చూడలేదు.



నవ్వించాలని ప్రేమ నీ ముందు కొస్తుంది
కవ్వించాలని ప్రేమ కనుమరు గవుతుంది.



భువిని ప్రేమ పాలిస్తుంది
దివిని ప్రేమ గాలిస్తుంది.
గాలిలా గగనంలో తిరుగుతుంది.
గాలి లేని చోట జాలి తానే నంటుంది.
అట్టి ప్రేమ
మధురలో మకాం పెడితే,
మగువలు మనసుతో నిలదీస్తున్నారు. రాగాలు తీస్తున్నారు.
అవియే భ్రమర గీతలు. భామల ప్రేమ వ్యంగ్యములు.
గోప భామల ఉత్ప్రేక్ష వ్యంజనములు.

(30వ పేజీ తరువాయి)

జ్ఞానబ్రహ్మ, ఆర్షవిద్యా వాచస్పతి శ్రీ సుందర చైతన్యానంద స్వాముల వారికి నమస్కారములు.

ఆధునిక యుగంలో తత్త్వమార్గ దర్శకు లైన శ్రీ రామకృష్ణ పరమహంస, శ్రీ వివేకానంద స్వామి, శ్రీ రమణ మహర్షి, శ్రీ అరవింద యోగి - సర్వులు మీలో నిక్షిప్తమై ఉన్నారు.

గురువు అంటే ఏమిటో అర్థం గాని ఈ కాలంలో సశాస్త్రీయంగా, ఉపనిషత్ప్రమాణంగా మీరు చేస్తున్న సాంప్రదాయక బోధలలో ఋషి హృదయం, కృష్ణ తత్త్వం గోచరిస్తున్నాయి. మీ అనంత జ్ఞానానికి శతకోటి పాదాభివందనాలు. మీ శిష్యకోటి జీవితాలలో మీరు కురిపిస్తున్న అద్వైతామృతము వారిని కృష్ణ చైతన్యములో నింపుతున్నదని నా ప్రగాఢ విశ్వాసము. మీ విశిష్ట వశిష్టత్వానికి అనంతకోటి ప్రణామములు సమర్పిస్తూ, మీ ఆశీస్సులను అర్థిస్తున్నాము.

ఎన్.పార్థసారథి ఆచార్యులు
చెన్నకేశవ స్వామి దేవస్థానం
బోగోల్, నెల్లూరు.

(**గమనిక :** *శ్రీ ఎన్.పార్థసారథి ఆచార్యులు శ్రీ చెన్నకేశవ స్వామి గుడిలో అర్చకులు. పూజ్య స్వామీజీ రచించిన 'చైతన్య రామాయణము'ను పఠనం చేసి, గ్రంథ సహితంగా శ్రోతలైన భక్తులతో కలిసి నెల్లూరు నుండి భద్రాచలమునకు పాదయాత్ర నిర్వహించి, చైతన్య రామాయణ గ్రంథమును భద్రాద్రి రామునికి సమర్పించారు* .... - **సి.పద్మ**, *గిరిధారి కార్యాలయం*)

అక్షర స్తుతి


గడ్డం చంద్రయ్య
సిరిసిల్ల

సీ॥ నీకంటి చూపులో ఏ శక్తి ఉన్నదో
సానంద భాష్పాలు జాలువారు
నీ మందహాసాన ఏ మహిమ ఉన్నదో
పాషాణ హృదయంబు పరవశించు
నీ హస్తస్పర్శలో ఏ చలువ ఉన్నదో
తనువు పులకరించి ధన్యమగును
నీ పాదయుగళిలో ఏ బోధ యున్నదో
ఆత్మతత్వము మాకు అర్థమగును

గీ॥ కళ్ళుకావవి ప్రేమ వాకిళ్ళు స్వామి
నవ్వుకాదది గులాబి పువ్వు స్వామి
స్పర్శకాదది మీ పరామర్శ స్వామి
పాదములు కావు దివ్యబోధనలు స్వామి

సీ॥ పంచ భక్ష్యంబులు భక్షించిననుగాని
సంతృప్తిజెందని జన్మ మాది
భక్తి సూత్రములెల్ల వల్లెవేసినగాని
పరనిందమానని బ్రతుకుమాది
ముత్యాల రాసులు ముంగిటబోసిన
కొసరుకై చేజాచు గుణము మాది
అండగా బంగారు కొండవై నీవుండ
కల్ల పసిడికేడ్చు ఘనత మాది

గీ॥ చూడముచ్చటైన సుగుణంబులరుదైన
మమ్ము సంస్కరింప మనసు గలిగి
అవతరించినావు ఆశ్రితమందార
ప్రణతులందుకొనుము 'జ్ఞానబ్రహ్మ'



ఆత్మ బంధువులారా,

ఓం నమో భగవతే వాసుదేవాయ:

నిప్పును ఎవ్వరూ ముట్టుకోరు. చేతితో పట్టుకోరు. ఎవరో చెప్పడం వల్ల మనం అలా ప్రవర్తించడం లేదు. నిప్పుకు దూరంగా ఉండటం వెనుక ఏదో వైరాగ్యం ఉండీ కాదు. నిప్పు ప్రమాదకర మని మనకు తెలుసు. పట్టుకుంటే కాలుతుంది అనే జ్ఞానం మనకు ఉంది. సత్యానికి సంబంధించిన అవగాహన ఉంది. వాస్తవాలు తెలిసినపుడే విరక్తి కలుగుతుంది.

అర్థం కానివి ఆందోళనను కలిగిస్తూ ఉంటాయి. భయాలను సృష్టిస్తూ ఉంటాయి. ఏది ఏమిటో అర్థం కానపుడు అభద్రత చోటు చేసుకుంటుంది. అర్థమైతే, విరక్తి జనిస్తుంది. నిప్పుకు సంబంధించిన జ్ఞానం ఏర్పడింది కనుక మనం దూరంగా ఉంటున్నాము. ఎవరు చెప్పినా ఇక ముట్టుకోము. జ్ఞానము కోరికను నిరోధిస్తుంది.

అజ్ఞానము భయాలను సృష్టిస్తే, జ్ఞానము ఆనందాన్ని ఆవిష్కరిస్తుంది. భయాల వెనుక కామం ఉంది. ఆనందము వెనుక ప్రేమ ఉంది. కామం నుండి విడిపడటానికి జ్ఞానమే ఎలా ప్రధానంగా ఉందో, ప్రేమలో తన్మయులం కావడానికి కూడా జ్ఞానమే ప్రముఖంగా తెలుస్తోంది.

ప్రపంచంలో ఎవరినైనా, దేనినైనా ప్రేమిస్తూనే మనం బ్రతకాలి. అది జరగనపుడే సంఘర్షణ చోటు చేసుకుంటుంది. ప్రపంచం మనకు శత్రువు కాదు. ఎవరూ మనకు శత్రువులు కారు. మనం కూడా ఎవ్వరికీ శత్రువులం కాలేము. శత్రుత్వముతో సుఖంగా బ్రతకలేము.

నిప్పు పట్టుకుంటే చెయ్యి కాలుతుంది అనేది ఎలా ధర్మమో, ఈ ప్రపంచంలో ప్రేమిస్తూనే జీవించాలి అనేది కూడా ధర్మమే. ప్రపంచంలో ఎవరిని ద్వేషించినా పరమేశ్వరుని ప్రేమించడం సాధ్యం కాదు అనేదే ప్రేమ వెనుక దాగి యున్న ధర్మము. ఈ ధర్మరూపంలో ఉన్నది దైవమే కనుక ప్రేమే దైవంగా గోచరిస్తుంది. ప్రేమించడం దైవారాధనగా మారుతోంది.

ప్రేమ ఉన్న చోట ప్రేమల్ని నిరోధించడం ఎలా సాధ్యపడదో, ప్రేమ లేని చోట ప్రేమను ఊరేగించడం కూడా సాధ్యపడదు. ప్రేమ ఆంతర్యంలో కలిగేదే గాని, బయట నుండి వచ్చి కలిసేది కాదు.

ప్రేమ అనేది కర్మ కాదు; కనుకనే ప్రయత్నంతో ప్రేమించలేము. ఇక మీదట నేను అందరినీ ప్రేమిస్తాను అని కొంత మంది పలుకుతూ ఉంటారు, అదేదో ఒక పని అయినట్లు; కర్మ అయినట్లు. అలా పలకడం లేదా పలవరించడం వెనుక ఉండేది ఆవేశమే గాని అవగాహన కాదు. ఆవేశాలు గడ్డిపోచల్లాగా మండి ఆరిపోతాయే గాని, అవగాహనలు వెలిగినట్లు దీపం లాగా పవిత్రంగా ప్రకాశించలేవు.

నాకు కాస్త భోజనం పెట్టండి అంటే ఎవ్వరైనా పెట్టవచ్చు. నన్ను కాస్త ప్రేమించండి అంటే? ఇది కాస్త విశ్లేషించ దగిన విషయం.

నన్ను ప్రేమించండి అని ఒకరు అడగగానే, వెంటనే గుండె లోతుల్లో నుండి ప్రేమ పొంగి వస్తుందా? అది సాధ్యమా? గజ్జె కట్టి ఆడినట్లు ప్రేమ కనుక కర్మ అయితే అది సాధ్యపడుతుంది. లేదా సాధ్యపడక పోతుంది. లేదా మరొక విధంగా వేరొకటి సాధ్య మవుతుంది. ఇలా జరగడం కర్మ అవుతుంది **(కర్తుం శక్యం అకర్తుం శక్యం అన్యథావా కర్తుం శక్యం)**, ప్రేమ కాలేదు, కాబోదు.

కర్మ చెయ్యా లనిపిస్తే, చెయ్యాలి అనుకున్న కర్మను రేపటికి వాయిదా వేసుకోవచ్చు. హృదయంలో పెల్లుబికే ప్రేమను రేపటికి నెట్టే అవకాశ ముందా? అందుకే ప్రేమ కర్మ కాదు అంటున్నాను.

ఇష్టం లేకున్నా కర్మ చేయవచ్చు. ఇష్టం లేకుండా ప్రేమించలేము. ఆ ఇష్టమేదో అదే ప్రియత్వము. ప్రియత్వము ఉన్నచోట ప్రేమ ఉండి తీరుతుంది. ఇంతకీ ప్రియ వస్తువు ఏది? ఎవరు ఎవరికి ప్రియము?

నన్ను కాస్త ప్రేమించు నాయనా! అని బిడ్డను తండ్రి అడగవచ్చు. ఇది ఎంత దారుణం? అది వేరే విషయం. తండ్రి అర్థించగానే బిడ్డ తండ్రిని తెగబడి, ఎగబడి ప్రేమించేస్తాడా? తండ్రి మీద ప్రియత్వము ఉంటే, బిడ్డ తండ్రిని ప్రేమించకుండా ఉండగలడా? ప్రియత్వము లేనపుడు ప్రేమించమని అర్థించినంత మాత్రాన ప్రేమ అందుతుందా?

ఒక వ్యక్తిలో ప్రేమానురాగాన్ని గాఢంగా కదిలించే శక్తి ఈ ప్రపంచంలో ఏ వ్యక్తికీ లేదు. ఏ వస్తువుకూ లేదు. ఏ సన్నివేశానికీ లేదు. ఒకరిలో మనం ప్రేమను కదిలించ గలిగితే అందరిలోనూ కదిలించగలము. ఇది సాధ్యమో, కాదో ఎవరికి వారు పరీక్షించి అర్థం చేసుకోవచ్చు.

మన కోర్కెలు తీర్చే వారి మీద, మనకు అనుగుణంగా జీవించేవారి మీద మనకు ప్రియత్వము ఉండొచ్చు. అట్టి ప్రియత్వంలో ఉండేది స్వార్థమే గాని ప్రేమ కాదు. అందుచేతనే, ఈ ప్రపంచంలో ప్రియములు, ప్రేమలు మట్టిబొమ్మల్లాగా పగిలి పోతున్నాయి. ఎండమావుల్లాగా ఏడిపిస్తున్నాయి. ఆశల వెంటబడి నిరాశలు పరుగు లెత్తుతున్నాయి. కలలన్నీ మంచు లాగా కరిగిపోతున్నాయి. ఇదే అందరి ఆరాటము. అందరిలో నిరంతరము సాగే పోరాటము. ఒక్క మాటలో చెప్పాలంటే సంసారము.

ప్రియత్వము లేని చోట ప్రేమ నిలవదు. అందరూ అందరికీ అన్ని వేళల్లో ప్రియంగా ఉండలేరు. ఒకవేళ ప్రియంగా గోచరించినా ఆ వ్యక్తి లోని గుణాలన్నీ మనకు ప్రియం కాకపోవచ్చు. ఒకరి ప్రేమను పొంది తృప్తి చెందుతున్నంత కాలం వారిలో ఉండే ఇతర గుణాలు మనకు గోచరించవు. అవి వ్యక్తం కాగానే పరిస్థితి మారిపోతుంది. ఆ గుణాలు లేదా అభిరుచులు లేదా ప్రవర్తనలు మనకు నచ్చనివి అయితే, వెంటనే మనలో ప్రేమ దెబ్బ తింటుంది. అంతటితో ఆగితే ఫరవాలేదు. అది ద్వేషంగా మారినా ఆశ్చర్యపడ నవసరం లేదు. ఇక్కడే అమృతం అనుకున్నది విషంగా మారుతోంది.

మారే వాటిని మారకుండా ఆపలేము. మారే వాటితో పాటు మన మనస్సు మారకుండా ఉండేది ఎలాగో మనమే ఆలోచించుకోవాలి. ఎవరు ఎలా ప్రవర్తించగలరో అలాగే ప్రవర్తిస్తారు. మన ఊహలకు అనుగుణంగా ప్రపంచం నడవదు.

నేను చెబుతున్నది మంచినే కదా? అలా ఆచరిస్తే వారికే క్షేమం కదా? ఆచరించలేక పోతే చెడే దెవరు? నిజమే. ఈ ప్రశ్నలన్నీ వాస్తవాలే. వీటిని ఎవరూ నిరాకరించడం లేదు. ఆచరించలేని వారు కూడా ఈ ప్రశ్నలతో విభేదించడం లేదు. నువ్వు చూపే మంచి మార్గంలో వారికి కూడా నడవాలనే ఉంది. కాని, నడవలేక పోతున్నారు. నడవగలిగి ఉంటే నడిచేవారే. నడవలేకనే మరో విధంగా నడుస్తున్నారు.

అలా మరో విధంగా చరించడం వెనుక ధర్మాలున్నాయి. నియతి ఉంది. అదొక విధమైన అజీర్ణము. ఇష్టపడి ఆరగించినా జీర్ణం కాని, కాలేని ఆహారము చిత్రించిన రోగ విన్యాసము.

మనం చెప్పింది విని ఆచరించని వ్యక్తి ఈ క్షణాన ఏ లోకం నుండో ఊడిపడ్డవాడు కాడు. చాలా కాలంగా, జన్మల తరబడి ఈ ప్రపంచంలో బ్రతికినవాడు. అనేకములైన భావ తరంగాల ఒత్తిడికి లోనైనవాడు. ఇష్టాయిష్టాల ఊబిలో ఈత కొడుతున్నవాడు. ఏదో కొద్దిగా మన భావ సమీరాలు వీచాయని, ఒక్క క్షణాన సూత్రం తెగిన గాలిపటం లాగా వీటన్నిటి నుండి విడిపడలేడు. సదుపదేశాల పట్ల విలువ లేక కాదు; స్వభావాల నుండి విడిపడలేక.

అయుక్తమైన ఆహారాన్ని తీసుకుంటే అనారోగ్యం కలుగుతుంది. అందులో ఆశ్చర్య మేముంది? కలగకపోతే ఆశ్చర్యపడాలి. పట్టాల మీదనే రైలు పరుగులు తీసినట్లు, స్వభావాలను ఆధారం చేసుకొనే మనుషులు ప్రయాణం చేస్తూ ఉంటారు. ఎవరి దారి ఎటు పోతుందో తెలియదు. ఎవరు ఎవరికి ఎప్పుడు అయిష్టంగా మారుతారో, సమీపించ లేనంత దూరంగా సాగుతారో ఊహించలేము.

అన్నీ అలాగే జరుగుతాయి. అలా జరగటం మనకు ఇష్టం లేకపోవచ్చు. జరిగే వాటిని మన ఇష్టాయిష్టాలు ఆపలేవు. జరగని వాటిని మన ఆశలు కదపలేవు. ఆశాదీపాల్ని వెలిగించుకొనే స్వేచ్ఛ అందరికీ ఉంది. అవి కొడిగట్టి ఆరిపోకుండా నిలిపే శక్తి ఎవరి కుంది? ఈ సత్యం తెలియని వారెవరు? అందుకే కదా, ప్రియమైన వ్యక్తుల చేత కూడా ప్రమాణాలు చేయించుకుంటారు! అలా ఉంటానని ప్రమాణం చెయ్యి, ఇలా ఉండనని ప్రమాణం చెయ్యి అని చేతుల్ని తలల పైకి ఎక్కిస్తూ ఉంటారు. ప్రయోజన మేమిటి? చేతుల్ని పైకి ఎత్తడం తేలికే కావచ్చు. చిత్తాల్ని దించడం, లేదా వంచడం అనుకున్నంత సులభం కాదు. అది కూడా తెలుసు కనుకనే ప్రమాణాలు చేయించుకుంటారు. ప్రమాణాలు చేయించుకున్నంత మాత్రాన ప్రవర్తనలు గాడి తప్పుతాయా?

చెప్పింది చెయ్యగలిగే వారి చేత ప్రమాణం చేయించుకో నవసరం లేదు. చెయ్యలేని వారి చేత ప్రమాణాలు చేయించుకొని మాత్రం సాధించేదే ముంటుంది? ప్రమాణాలు ప్రవర్తనలను మార్చలేవు. పలుకులు ఒక విధంగా వినపడుతూ ఉంటాయి. కులుకులు మరో విధంగా కనపడుతూ ఉంటాయి. వీటి వెనుక ధర్మం ఉంది. నియతి ఉంది. శ్రమించి అర్థం చేసుకోవలసిన సూక్ష్మమైన సత్యాలన్నీ దాగి ఉన్నాయి.

ఇంతకీ చెప్పొచ్చిం దేమిటంటే, ఉన్న నాలుగు రోజులు మనిషి ఆనందంగా బ్రతకాలి. ఆనందం అనేది ప్రేమ నుండే పుడుతుంది. ఆశించడం ప్రేమ కాదు. అర్థం చేసుకోవడమే ప్రేమ.

ప్రపంచం ఎలా నడుస్తూ ఉందో, వ్యక్తులు ఎలా చరిస్తూ ఉన్నారో వాటిని అర్థం చేసుకుంటూ అంగీకరించడం లోనే జ్ఞానం ఉంది. ప్రేమ ఉంది. ఆనందం ఉంది. ఇక్కడే ఘర్షణ లన్నీ అంతరించిపోతాయి. గుండెల్లో చల్లని గాలులు వీస్తున్నట్లు ఉంటుంది.

ఏదో మారితే, లేదా ఎవరో మారితే మనకు ఆనందం కలుగుతుందా? అదే నిజమైతే, ఈ క్షణాన పరివర్తన చెంది మనల్ని తృప్తి పరచినవాళ్ళు, మరో క్షణంలో మరో విధంగా చరించి అసంతృప్తికి గురి చేయరు అనే నమ్మక మేముంది? ఆలోచించండి. మన మనుకున్నట్లు పరిస్థితులు లేదా వ్యక్తులు మారితే మనకు ఎంత సుఖమో చెప్పలేము గాని, మారని పరిస్థితుల్ని, మారలేని వ్యక్తుల్ని అర్థం చేసుకొని, ఘర్షణకు తావివ్వకుండా మనస్సును జోకొట్టి నిద్రపుచ్చ గలిగితే మాత్రం మనిషికి ఎనలేని ఆనందం కలుగుతుంది.

శ్రీకృష్ణుడు గోవర్ధనగిరిని ఎత్తి ఉండొచ్చు. అయ్యో! నేను బియ్యపు బస్తాను కూడా ఎత్తలేక పోతున్నానే! అని దుఃఖిస్తూ కూర్చుంటే బియ్యపు బస్తా విషయం దేవుడెరుగు, బీరకాయను ఎత్తలేని పరిస్థితి దాపురించినా ఆశ్చర్యపడ నవసరం లేదు.

అశక్తతల్ని అర్థం చేసుకోవడానికి కూడా మనిషి శక్తివంతుడై ఉండాలి. అసమర్థతల్ని అర్థం చేసుకోవడంలో సమర్థతకు శ్రీకారం చుట్టడం జరుగుతూ ఉందనే సత్యం అందరికీ అర్థమయ్యేది కాకపోయినా అందరూ శ్రమించి అర్థం చేసుకోగలిగింది.

మారలేని వాటిని అర్థం చేసుకున్నట్లే, మారవు అని తెలిసి కూడా మార్చాలనే ప్రయత్నాన్ని విరమించలేని మన మనస్సు వెనుక దాగియున్న అనివార్యమైన నియతిని కూడా అర్థం చేసుకోగలిగితే, ఆ తరువాత మార్పుకు ప్రయత్నాలు చేయడం ఆగదు కాని, మరొక కొంగ్రొత్త మార్గంలో ప్రయత్నాలు సాగుతాయి. అవి ఉభయులకూ అభయాన్ని, ఆనందాన్ని పంచుతాయి. అవేమిటో తెలుసా! అవియే భగవత్ప్రార్థనలు.

భగవాన్! మారలేని ఎందరితోనో నా బ్రతుకు ముడిపడి ఉంది. వాళ్ళను నేను తప్పు పట్టడం లేదు. నిందించడం లేదు. వారు అలాగే జీవిస్తారు. మరో లాగా జీవించలేరు. వాళ్ళ మధ్య నిర్మల కమలం లాగా జీవించే శక్తిని ప్రసాదించు.

భగవాన్! నాలో మార్పును నీవే తీసుకొని రావాలి. భగవాన్! నిన్నే నమ్ముకున్నవాణ్ణి. నా బ్రతుకును నేనే వమ్ము చేసుకొనే ప్రమాదం లేకపోలేదు. నా కృషితో సాధించలేనిది నీ కృపతో సాధ్యపడుతుంది.


కృపాసాగరా! శ్రీకృష్ణా! ఇతరుల్ని మార్చే శక్తి నాకు లేకపోవచ్చు. కాని, నీకు ఉంది. నీ అనుగ్రహంతో వాళ్ళు మారుతారు. వీళ్ళు మారుతారు. నేనూ మారుతాను. ఎవరు మారరు? అందరినీ మార్చే సర్వశక్తిమత్వం నీకే ఉంది. అందరినీ అనుగ్రహించు ప్రభూ!


ఈ ప్రార్థనలు త్రికరణశుద్ధిగా సాగితే ఫలితాలు అందుతాయి. ప్రశాంతతలు నిండుతాయి. ఫలం వస్తేనే కాదు. రాకపోయినా కూడా ఆనందం దూరం కాదు. ఎందుకో తెలుసా! అలా రాకపోవడం వెనుక ఉండే నియతి కూడా నియంత వైభవమే అని తెలిసి పోయింది కనుక.

లోకా స్సమస్తా స్సుఖినో భవన్తు!


ప్రేమతో

ఓం స్వామి సుందర చైతన్యానంద









ఆలయంలో
విగ్రహ ప్రతిష్ఠ
కుంభాభిషేకం

